Email : telanganaveenaoffcial@gmail.com

Title Code : 12280

# తెలంగాణ వీణ

నిజం నిగ్గు తేలుద్దాం..




http://Epepar.telanganaveena.com | బుధవారం జూన్ 11 2025 | సంపుటి:2 | సంచి 257 | హైదరాబాద్ | పేజీలు:8 | రూ.3/-



## ఢిల్లీలోనే మకాం వేసినా
# సీఎం రేవంత్



### పిలుపు రావడంతో హుటాహుటిన ఢిల్లీకి మంత్రి ఉత్తమ్

- మంత్రులకు శాఖల కేటాయింపులపై కసరత్తు
- కొందరు మంత్రుల శాఖల మార్పుపైనా చర్చ
- కేసీ వేణుగోపాల్, ఖర్గేలతో సీఎం మంతనాలు

**తెలంగాణ వీణ, హైదరాబాద్**

తెలంగాణ మంత్రుల శాఖల్లో భారీ మార్పులకు అవకాశం ఉన్నట్లు సమాచారం. కొత్త మంత్రులకు శాఖల కేటాయింపుతో పాటు శాఖల మార్పులపైన కాంగ్రెస్ అధిష్టానం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే రెండురోజులుగా ఢిల్లీలో మకాం వేసిన సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ అగ్రనేతల మధ్య చర్చలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి ఢిల్లీ నుంచి పిలుపు వచ్చింది. దీంతో ఆయన హుటాహుటిన ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. ఇకపోతే -మిగతా 2 లో



## నేడు కాళేశ్వరం కమిషన్
# ముందుకు కేసీఆర్



- మరోమారు కేసీఆర్‌తో హరీష్ సుదీర్ఘ మంతనాలు
- చర్చనీయంశాలపై ఇరువురు నేతల మల్లగుల్లాలు
- భారీ కాన్వాయ్‌తో కేసీఆర్ హాజరయ్యేలా ప్లాన్

**తెలంగాణ వీణ,గజ్వేల్**

కాళేశ్వరం కమిషన్ విచారణకు బుధవారం బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ హాజరు కానున్నారు. ఈ సందర్భంగా భారీగా జనసమీకరణతో రావాలని పార్టీలో చర్చించారు. కెసిఆర్ వెంట భారీ కాన్వాయ్‌తో వచ్చి హల్‌చల్ చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. ఇదిలావుంటే మాజీ మంత్రి హరీశ్ రావు మరోసారి కెసిఆర్‌తో భేటీఅయ్యారు. ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కేసీఆర్, హరీశ్ రావు మధ్య -మిగతా 2 లో



# 146 కోట్లకు భారత జనాభా..

- తగ్గిన ఫెర్టిలిటీ రేటు
- ఐక్యరాజ్యసమితి నివేదిక

**తెలంగాణ వీణ,న్యూఢిల్లీ**

2025 సంవత్సరంలో భారత దేశ జనాభా 146 కోట్లకు చేరుకుంటుందని ఐక్యరాజ్యసమితి ఓ నివేదిక రిలీజ్ చేసింది. ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశంగా భారత్ నిలుస్తుందని యూఎన్ డెమోగ్రాఫిక్ రిపోర్టులో తెలిపారు. దేశంలో పునరుత్పత్తి శాతం పడిపోయినట్లు ఆ రిపోర్టులో వెల్లడించారు. యూఎన్ఎఫ్‌పీఏ 2025 స్టేట్ ఆఫ్ వరల్డ్ పాపులేషన్ -మిగతా 2 లో

## 11 ఏళ్లలో అవినీతి రహిత
# సమర్థ పాలన



### ప్రపంచ దేశాలు భారత్‌వైపు చూసేలా చేసిన మోడీ

- అనేక సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం
- 11 ఏళ్ల అభివృద్ధి కార్యక్రమాలపై పుస్తకం విడుదల
- కార్యక్రమంలో మాట్లాడిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

**తెలంగాణ వీణ, విజయవాడ,**

మోదీ నాయకత్వంలో.. ఈ 11సంవత్సరాలలో దేశంలోని అన్ని రంగాలు అభివృద్ధి పథంలో ముందుకి దూసుకెళుతున్నాయని భారత ప్రధాని నరేంద్ర మోదీపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రశంసల జల్లులు కురిపించారు. దేశ ప్రజల కోసం ఆయన అనేక సంక్షేమ కార్యక్రమాలు అందించారని అన్నారు. విజయవాడ పర్యటనకు వచ్చిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి దేశంలో బీజేపీ ప్రభుత్వం సాధించిన విజయాలను మాట్లాడుతూ.. -మిగతా 2 లో

# హైకోర్టులో హరీష్ రావుకు ఊరట

- ఎన్నికల పిటిషన్‌ను కొట్టేసిన కోర్టు



**తెలంగాణ వీణ, హైదరాబాద్,**

తెలంగాణ హైకోర్టులో మాజీ మంత్రి హరీశ్‌రావుకు ఊరట లభించింది. ఆయనపై వేసిన ఎన్నికల పిటిషన్‌ను కోర్టు కొట్టివేసింది. ఎన్నికల అఫిడవిట్‌లో హరీశ్‌రావు సరైన వివరాలు ఇవ్వలేదని గతంలో చక్రధర్ గౌడ్ వేసిన పిటిషన్‌ను -మిగతా 2 లో

## ఏడాదిన్నరలో 60 వేల
# ప్రభుత్వ ఉద్యోగాలు



- బయోసైన్స్, కృత్రిమ మేధలో పెట్టుబడులకు అనుకూలం
- తెలంగాణలో పెట్టుబడులతో షైవా గ్రూప్ భాగస్వామి
- రూ.2,125 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ఎంవోయూ
- ప్రైవేటు రంగంలో లక్షకు పైగా ఉద్యోగ అవకాశాలు
- ఐటి శాఖ మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి

**తెలంగాణ వీణ,హైదరాబాద్,**

తమది మాటల ప్రభుత్వం కాదని, చేతల్లో చూపించే ప్రభుత్వం అని ఐటీ- శాఖా మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. తెలంగాణ ప్రతిభకు కేర్ ఆఫ్ అడ్రస్‌గా మారిందన్నారు. పెట్టుబడుల విషయంలో ప్రతిపక్షాలు దుష్ప్రచారాలు చేయొద్దని, తెలంగాణకు వచ్చే పెట్టుబడులు ప్రతిపక్షాలకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. తెలంగాణ ప్రభుత్వం కొత్త పరిశ్రమలకు మెరుగైన అవకాశాలు కల్పిస్తోందని, -మిగతా 2 లో



# ఆషాఢ బోనాలకు 20 కోట్లు విడుదల


- శాఖల మధ్య సమన్వయంతో ముందుకు సాగాలి
- హైదరాబాద్‌కు పేరు తెచ్చేలా బోనాల నిర్వహణ
- అధికారులతో మంత్రులు పొన్నం, కొండా సురేఖల సమీక్ష

**తెలంగాణ వీణ, హైదరాబాద్,**

నగరంలో ప్రసిద్ధి చెందిన ఆషాఢ పండుగ బోనాల ఉత్సవాలు త్వరలో ప్రారంభం కానున్న నేపథ్యంలో బోనాల ఉత్సవాలపై మంగళవారం అన్ని విభాగాల అధికారులతో మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్లు సమీక్షించారు. బోనాల పండుగ కోసం ప్రభుత్వం రూ. 20 కోట్లు కేటాయించిందని మంత్రి తెలిపారు. ఎటువంటి ఇబ్బంది లేకుండా గత ఏడాది బోనాల పండుగ జరుపుకున్నామని, ఒకటి రెండు చోట్ల ఇబ్బందులు తలెత్తాయని.. ఈ సారి ఎలాంటి -మిగతా 2 లో

## పాక్ ఉగ్రవాద చర్యలను
# ఏమాత్రం సహించం

- ఇలాగే కొనసాగితే పాక్‌లో చొచ్చుకు వెళ్లి దాడి చేస్తాం
- విదేశాంగ మంత్రి జై శంకర్ ఘాటు హెచ్చరికలు



**తెలంగాణవీణ,బ్రసెల్స్,**

ఉగ్రదాడులతో రెచ్చగొడితే పాకిస్థాన్ లోపలకు చొచ్చుకెళ్లి మరీ భారత్ దాడులు చేస్తుందని విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్ దాయాది దేశాన్ని మరోమారు హెచ్చరించారు. పహల్గాం వంటి పాశవిక ఉగ్రదాడులకు టెర్రరిస్టు సంస్థలు, వారి నేతలు పాల్పడితే దెబ్బకు దెబ్బ తీస్తామని -మిగతా 2 లో



# రాబోయే మూడురోజులు భారీ వర్షాలు..!

- అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరిక

**తెలంగాణ వీణ, హైదరాబాద్,**

తెలంగాణలో రాగల మూడురోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. మంగళవారం మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాలలో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. అలాగే, ఆదిలాబాద్, కొమరంభీం ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిపిల్ల, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ -మిగతా 2 లో

# ఢిల్లీలోనే మకాం వేసిన సీఎం రేవంత్

(మొదటి పేజీ తరువాయి)

సోమవారం కాంగ్రెస్ కార్యదర్శి కేసీ వేణుగోపాలతో గంటకుపైగా రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో సీఎం రేవంత్ రెడ్డి బేటి అయ్యారు. ఖర్గేతో భేటీ తరువాత మంత్రుల శాఖల మార్పులు ఖరారు కానున్నాయి సమాచరం. అలాగే కొత్త మంత్రులకు కూడా శాఖల కేటాయింపు జరుగుతుంది. ఈ క్రమంలో ప్రస్తుతం వివిధ శాఖలను నిర్వహిస్తున్న మంత్రుల శాఖల్లో కూడా మార్పులు చోటుచేసుకుంటాయని ప్రచారం నడుస్తోంది. మంత్రి పదవులే కాదు.. శాఖల కేటాయింపుల్లోనూ సామాజిక న్యాయంకు ప్రాధాన్యత నివ్వాలని కాంగ్రెస్ అధిష్టానం పేర్కొంది. కొందరు మంత్రుల పనితీరు సరిగా లేదంటూ ఇప్పటికే కొందరు పార్టీ నేతలు అధిష్టానానికి నివేదించారు. అలాగే మంత్రుల పనితీరుపై ఇప్పటికే పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ అధిష్టానానికి నివేదిక ఇచ్చారు. పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు, వివిధ స్థాయి నేతలతో భేటీలో అందిన సమాచారం ఆధారంగా ఆమె నివేదికలు రూపొందించారు. కీలక శాఖల బాధ్యతలు అన్ని కొందరు మంత్రులే నిర్వహిస్తుండటంతో పని భారం కారణంగా కొన్ని శాఖల్లో ఆశించిన ఫలితాలు రావట్లేదనే అంచనలో కాంగ్రెస్ ముఖ్య నేతలు ఉన్నారు. మంత్రుల పనితీరు వ్యవహార శైలిపై కేసి వేణుగోపాల్ గతంలోనే ఢిల్లీలో సమావేశం నిర్వహించి సూచనలు సలహాలు ఇచ్చారు. ప్రభుత్వ పాలనా వ్యవహారాలు, మంత్రుల వ్యవహార శైలి, పనితీరుపై తన అంచనాలను అధిష్టాన ముఖ్యులతో సీఎం రేవంత్ రెడ్డి పంచుకున్నారు. విద్య, మున్సిపల్ పట్టణాభివృద్ధి, హోం, న్యాయం సహా పదికి పైగా కీలక శాఖలు ముఖ్యమంత్రి వద్దే ఉన్నాయి. ప్రస్తుతం ముఖ్యమంత్రి వద్ద ఉన్న మున్సిపల్ పట్టణాభివృద్ధి శాఖను విడగొట్టి మున్సిపల్ శాఖను మరొకరికి ఇచ్చే అవకాశం ఉంది. కాగా తనకు విద్యుత్తు లేదా విద్యాశాఖ ఇవ్వాలని వివేక్ కోరుతున్నారు. ప్రస్తుతం ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వద్ద విద్యుత్ శాఖ ఉంది. త్వరలో కొన్ని కార్పొరేషన్ చైర్మన్ పోస్టులను భర్తీ చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. కాగా తెలంగాణలో కొత్తగా ప్రమాణ స్వీకారం చేసిన మంత్రులకు శాఖల కేటాయింపుపై హస్తినలో కసరత్తు మొదలైంది. ఇందులో భాగంగా సోమవారం సాయంత్రం ఢిల్లీలోని ఇందిరా భవన్‌లో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటీ అయి దాదాపు గంటసేపు చర్చించారు. మంత్రులకు శాఖల కేటాయింపుపైనే ప్రధానంగా వీరి చర్చ సాగినట్టు- తెలిసింది. ప్రస్తుతం మంత్రివర్గంలో ఎవరెవరి దగ్గర ఏయే శాఖలున్నాయి? రెండు, మూడు మంత్రిత్వ శాఖలు నిర్వహిస్తున్న వారెవరు? కొత్తగా మంత్రివర్గంలో చేరిన వాకిటి శ్రీహరి, గడ్డం వివేక్, అడ్లూరి లక్ష్మణ్‌కు ఏ శాఖలు కేటాయించాలి? అనే అంశాలపై సుధీర్ఘంగా చర్చించినట్టు సమాచారం. దీనికి సంబంధించిన జాబితాను కేసీ వేణుగోపాల్‌కు సీఎం రేవంత్ అందించినట్టు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది.ప్రస్తుతం ఎవరికీ కేటాయించని శాఖలను కొత్తవారికి కేటాయించే అంశంపై సమాలోచన జరిగినట్టు- తెలుస్తోంది. అయితే, ప్రస్తుతం ఎవరికీ కేటాయించని శాఖలన్నీ ముఖ్యమంత్రి వద్దే ఉన్నాయి. అందులో ప్రధానమైనవి.. విద్య, పురపాలకం, హోం, గనులు, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ- సంక్షేమం, వాణిజ్య పన్నులు, పశుసంవర్ధక శాఖ, న్యాయ, కార్మిక, క్రీడలు యువజన శాఖ. వీటిలో విద్యా శాఖను తనకు కేటాయించాలని గడ్డం వివేక్ కోరుతున్నట్టు- తెలిసింది. ఇదే విషయాన్ని మల్లికార్జున ఖర్గేకు సైతం తెలియజేసినట్టు- సమాచారం. అయితే, వివేక్‌కు కార్మిక, మైనింగ్, క్రీడల శాఖ.. అడ్లూరి లక్ష్మణ్‌కు ఎస్సీ, ఎస్టీ సంక్షేమం, వాకిటి శ్రీహరికి పశుసంవర్ధక, యువజన, న్యాయ లేదా మత్స్య శాఖ కేటాయించే అవకాశం ఉన్నట్టు- జోరుగా ప్రచారం జరుగుతోంది. దీంతోపాటు-.. మంత్రివర్గంలో స్థానం దక్కుతుందని ఆశించి నిరాశ చెందిన వారి ప్రభావమెంత వారిని శాంతింపజేయడం ఎలా అనే అంశాలపై కూడా కేసీ, రేవంత్ రెడ్డి మధ్య చర్చ జరిగినట్టు సమాచారం. మంత్రివర్గంలో మరో ముగ్గురికి అవకాశం ఉన్న నేపథ్యంలో మిగిలిన వారికి ఈసారి చోటు- కల్పిస్తామనే నమ్మకం కలిగించాలని రేవంత్ రెడ్డికి కేసీ సూచించినట్టు తెలిసింది. అలాగే.. ప్రస్తుతం కీలక మంత్రిత్వ శాఖలు నిర్వహిస్తున్న వారి వ్యవహారశైలి, పనితీరు తదితర అంశాలను ఆయన అడిగి తెలుసుకున్నట్టు- సమాచారం. ఈ నేపథ్యంలో ఒకరిద్దరి మంత్రుల శాఖల్లో మార్పులు చేసే అవకాశం ఉన్నట్టు- కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ క్రమంలోనే ఉత్తమ్‌కు పిలుపు రావడంతో అనుమానలు బలపడుతున్నాయి. ఉత్తమ్ నీటిపారుదలతో పాటు పౌరసరఫరాల శాఖ నిర్వహిస్తున్నారు. దీంతో ఆయన శాఖల్లో మార్పులు జరగవచ్చని అంటున్నారు.

## నేడు కాళేశ్వరం కమిషన్ ముందుకు కేసీఆర్

(మొదటి పేజీ తరువాయి)

కాళేశ్వరం కమిషన్ విచారణ అంశంపై సుదీర్ఘ చర్చ జరిగింది. కాళేశ్వరం కమిషన్ ఎదుట కేసీఆర్ హాజరుకానున్న నేపథ్యంలో ఇద్దరు నేతలు విచారణ అంశంపై చర్చించారు. బలప్రదర్శన ఏర్పాట్లపై కూడా చర్చ జరిగినట్లు తెలుస్తోంది. కాళేశ్వరం కమిషన్‌కి ఇచ్చేందుకు ఇప్పటికే కేసీఆర్ నివేదిక సిద్ధం చేశారు. అయితే హరీష్ రావును కాళేశ్వరం కమిషన్ అడిగిన ప్రశ్నల ఆధారంగా మరో నివేదిక కూడా సిద్ధం చేస్తున్నారని తెలుస్తోంది. హరీష్ రావుతో పాటు- ఫామ్‌హౌస్‌లో మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి కూడా ఉన్నారు. సోమవారం కాళేశ్వరం కమిషన్ విచారణకు సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు హాజరయ్యారు. విచారణ అనంతరం నేరుగా ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌కు వెళ్లిన హరీశ్ రావు.. కేసీఆర్‌తో భేటీ అయ్యారు. కాళేశ్వరం కమిషన్ అడిగిన ప్రశ్నలు, విచారణ తీరుపై కేసీఆర్‌కు వివరించారు. వీరి భేటీ సుమారు 5 గంటల పాటు సాగింది. మంగళవారం మరోసారి హరీశ్ రావు ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌కు వెళ్లి కేసీఆర్‌తో భేటీ- అయ్యారు. కాళేశ్వరం కమిషన్ విచారణకు బుధవారం కేసీఆర్ హాజరుకావాల్సి ఉండడంతో వీరి భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది. విచారణ సందర్భంగా కమిషన్‌కు అందించాల్సిన డాక్యుమెంట్స్ ఇప్పటికే సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ కూడా ఇచ్చే యోచనలో కేసీఆర్ ఉన్నట్లు- సమాచారం. కాళేశ్వరం కమిషన్ విచారణకు హాజరయ్యేందుకు కేసీఆర్ వెళ్లే సమయంలో ఆయనకు మద్దతుగా భారీ సంఖ్యలో బీఆర్ఎస్ శ్రేణులు వెళ్లేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇప్పటికే ప్రణాళికలు రూపొందించినట్లు- సమాచారం. హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డితో పాటు- చుట్టుపక్కల జిల్లాల నుంచి కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివస్తారని తెలుస్తోంది. మేడిగడ్డ బ్యారేజీ పియర్స్ కుంగడం.. అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో బుంగలు బయటపడిన నేపథ్యంలో గతేడాది రాష్ట్ర ప్రభుత్వం జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో విచారణ కమిషన్‌ను నియమించింది. ఇప్పటికే ఈటెల, హరీష్‌లతో విచారణ ముగిసింది.

## 146 కోట్లకు భారత జనాభా..

(మొదటి పేజీ తరువాయి)

రిపోర్టులో ఈ విషయాన్ని తెలిపారు. లక్షల సంఖ్యలో జనం ఫెర్టిలిటీ లక్ష్యాలను అందుకోవడం లేదని ఆ రిపోర్టులో చెప్పారు. ఇది నిజమైన సంక్షోభంగా మారుతోందని, దీనికి గల కారణాలు కూడా భిన్నంగా ఉన్నాయని, శృంగారం.. కాంట్రాసెప్షన్, ఫ్యామిలీ అంశాల్లో అవగాహన మారడం వల్ల ఈ సమస్య తలెత్తినట్లు ఆ రిపోర్టులో తెలిపారు.

# 11 ఏళ్లలో అవినీతి రహిత సమర్థ పాలన

(మొదటి పేజీ తరువాయి)

గత 11 సంవత్సరాల్లో భారతదేశం అనేక రంగాల్లో అసాధారణ పురోగతి సాధించిందని స్పష్టం చేశారు.' ఒక్క రూపాయి అవినీతి జరిగిందని ఏ రాజకీయ పార్టీ కూడా ఆరోపణలు చేయలేదని, నీతి నిజాయితీతో ఒక సమర్థవంతమైన నాయకత్వంతో మోదీ పాలన కొనసాగుతోందన్నారు.. ప్రపంచ దేశాలు సైతం భారత దేశం వైపు చూసేలా మోదీ పాలన సాగుతోంది. అన్ని సామాజిక వర్గాల వారికి పెద్దపీట వేసి పాలన చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపట్టిన అనేక పథకాలు క్షేత్ర స్థాయిలో అమలు జరిగేలా ప్రణాళికలు ఉంటున్నాయి. కరోనా సమయంలో పేద ప్రజలు ఎవరు ఆకలితో ఉండకూడదనే ఉద్దేశంతో రేషన్ అందించారు. 4 కోట్ల ప్రజలకి ఇళ్లు కట్టించారు. మౌలికంగా అనేక మార్పులు తీసుకొచ్చారని అన్నారు. అలాగే మోడీ ప్రభుత్వం 11 ఏళ్ల అభివృద్ధి కార్యక్రమాలపై పుస్తకాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షురాలు పురంధేశ్వరి ఇంకా బీజేపీ నేతలు దేశ అభివృద్ధికి మోడీ పాలన ఎంత కీలకమైందో వివరించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. గత 11 ఏళ్లలో మోడీ ప్రభుత్వం మీద ఒక్క అవినీతి ఆరోపణ కూడా రాలేదని, ఇది దేశ ప్రజల నమ్మకానికి నిదర్శనమన్నారు. పేద, అణగారిన వర్గాలకు పెద్దపీట వేసేలా మోడీ పాలన ఉందని అన్నారు. రైతులు, యువత, మహిళలు ఈ నాలుగు ప్రధాన విభాగాల అభివృద్ధి కోసమే ప్రతి కార్యక్రమం రూపకల్పన చేశారని అన్నారు. భారతదేశం నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని, ఇటీవలే 4 ట్రిలియన్ డాలర్స్ ఎకానమిగా మారిందని కిషన్ రెడ్డి తెలిపారు. పన్నుల వ్యవస్థలో సమగ్ర మార్పులు చేసి, జీఎస్టీ ద్వారా 'వన్ నేషన్ వన్ ట్యాక్స్' లక్ష్యాన్ని సాధించామని తెలిపారు. 2014లో 6.91 కోట్ల పన్నులు కట్టే వారు ఉండగా, ఇప్పుడు 15.66 కోట్లకు పెరిగిందని వివరించారు. అలాగే మోడీ ప్రభుత్వం రైతుల కోసం పలు కీలక నిర్ణయాలు తీసుకుందని తెలుపుతూ.. వ్యవసాయ బడ్జెట్ 25,633 కోట్ల నుంచి 1.33 లక్షల కోట్లకు పెరిగిందని, 82 శాతం వరకు గిట్టుబాటు ధరలు పెరిగినట్లు వెల్లడించారు. 11 కోట్ల మంది రైతులకు కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా ఏటా నేరుగా రైతు అకౌంట్ లోకి నగదు అందిస్తామని అన్నారు. అలాగే ఉగ్రవాదం విషయంలో జీరో టాలరెన్స్ పాలసీ అనుసరిస్తున్నామని చెప్పారు. పఠాన్ కోట్ సర్జికల్ స్ట్రయిక్ పహల్గావ్ దాడి, ఆపరేషన్ సింధూర్ వంటి చర్యలు భారత్ శక్తిని చాటిచెప్పినట్టు- పేర్కొన్నారు. బ్రహ్మోస్, బ్రహ్మాస్త్రం వంటి సామర్థ్యాలు దేశ రక్షణను మరింత బలంగా తీర్చిదిద్దాయని అన్నారు. మరోవైపు దేశంలో అమృత్ భారత్ పథకం కింద 1300 రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తుండగా.. 1.46 లక్షల కి.మీ. జాతీయ రహదారులు, 7.7 లక్షల కిమీ గ్రామీణ రహదారులు నిర్మించామని చెప్పారు. రైల్వే బడ్జెట్ 29,056 కోట్ల నుంచి 2.42 లక్షల కోట్లకు పెరిగిందని, 136 వందే భారత్ రైళ్లు ప్రారంభించామని వివరించారు. ఇక ఉడాన్ స్కీం ద్వారా సామాన్యులకూ విమానయానాన్ని అందుబాటులోకి తెచ్చామని, 2014లో 71 విమానాశ్రయాలు ఉండగా.. ఇప్పుడు 159కి పెరిగినట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా 26 ఆఒఒఃఅ ఆసుపత్రులు ఇప్పటికే పనిచేస్తుండగా, మరో 15 నిర్మాణంలో ఉన్నాయని వివరించారు. బేటీ- బచావో - బేటీ- పఢావో, దీన్ దయాళ్ ఉపాధ్యాయ విద్యుత్ యోజన, ఆర్టికల్ 370 రద్దు, 140 శాటిలైట్‌ల ప్రయోగం, చంద్రుడి దక్షిణ ధృవాన్ని చేరటం వంటి చర్యలు మోడీ ప్రభుత్వం సామాజికంగా, శాస్త్రీయంగా దేశాన్ని ముందుకు నడిపించిందని అన్నారు. ఇక తెలంగాణ రాష్ట్రం గురించి మాట్లాడుతూ.. 2014లో లాభాల్లో ఉన్న రాష్ట్రం, మోడీ విధానాలను పాటించకపోవడంతో ఇప్పటికి 10 లక్షల కోట్ల అప్పుల్లో కూరుకుపోయిందని కిషన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్డీఏ కూటమికి ప్రజలు మంచి విజయాన్ని అందించారని బీజేపీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి వ్యాఖ్యానించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారతదేశానికి సుపరిపాలన, ధృడమైన నాయకత్వంతో మంచి పాలన అందిస్తున్నారని ఉద్ఘాటించారు.

## హైకోర్టులో హరీష్ రావుకు ఊరట

(మొదటి పేజీ తరువాయి)

కొట్టివేసింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో సిద్దిపేటలో బీఆర్ఎస్ నుంచి హరీశ్‌రావు, కాంగ్రెస్ నుంచి హరికృష్ణ, బీఎస్పీ నుంచి చక్రధర్ గౌడ్ పోటీ చేశారు. అయితే ఈ ఎన్నికల్లో గెలిచిన హరీశ్‌రావు అఫిడవిట్‌లో పూర్తి సమాచారం వెల్లడించకుండా రహస్యంగా ఉంచారని చక్రధర్ గౌడ్ పిటిషన్ దాఖలు చేశారు. తన కుమారుడి వివరాలను అఫిడవిట్‌లో వెల్లడించలేదని పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై తాజాగా మరోసారి విచారణ చేపట్టిన హైకోర్టు.. దాన్ని కొట్టివేసింది. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఇప్పటికైనా ప్రతిపక్ష నాయకులపై కాంగ్రెస్ పార్టీ, రేవంత్ రెడ్డి కక్ష సాధింపు రాజకీయాలు మానుకోవాలని హితవుపలికారు. ప్రజలకు ఇచ్చిన హామీలపై దృష్టిసారించాలని సూచించారు. అక్రమ కేసులకు భయపడేది లేదని.. ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ పార్టీ నయవంచనను ఎండగట్టి తీరుతామని హెచ్చరించారు. ప్రజల తరఫున ప్రశ్నిస్తూనే ఉంటామని స్పష్టం చేశారు.

## పాక్ ఉగ్రవాద చర్యలను ఏమాత్రం సహించం

(మొదటి పేజీ తరువాయి)

స్పష్టం చేశారు. బహిరంగంగా పాక్ ఉగ్రవాదులకు శిక్షణను ఇస్తూ వారిని భారత్‌పైకి ఉసిగొల్పుతున్నారని, దీనిని ఇకముందు సహించేది లేదన్నారు. పహల్గాం ఉగ్రదాడికి జవాబుగా భారత్ ఆపరేషన్ సిందూర్ నిర్వహించిన నెల రోజుల అనంతరం యూరప్‌లో జైశంకర్ పర్యటిస్తున్నారు. ఇందులో భాగంగా బెల్జియం, లక్సంబర్గ్‌లో భారత సంతతి ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఎంతో మంది అమాయకులను పొట్టన పెట్టుకున్న ఉగ్రవాదులకు బహిరంగంగానే పాకిస్థాన్ శిక్షణ ఇస్తూ, వారిని ఇండియాపైకి ఉసిగొలుపుతోందని కేంద్రమంత్రి దుయ్యపట్టారు. ఉగ్రవాదాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదన్నారు. భారత్‌పై దాడులకు ఉగ్రవాదాన్ని ఒక సాధనంగా పాకిస్థాన్ మార్చుకుందని, ఇదే రెండు దేశాల మధ్య సమస్యలకు దారితీస్తోందని చెప్పారు. పాక్‌తో గత నెలలో యుద్ధం చెలరేగడానికి దారి తీసిన పరిస్థితులు ఇప్పటికీ అలాగే ఉన్నాయా? అనే ప్రశ్నకు జైశంకర్ బదులిచ్చారు. ఉగ్రవాదంతో ఉద్రిక్తతలు పెంచడానికే వాళ్లు కట్టుబడి ఉంటే ఆ పరిస్థితులు ఉన్నట్టేనని ఆయన సమాధానమిచ్చారు. యుద్ధం సందర్భంగా జరిగిన నష్టంపై కేంద్రమంత్రిని ప్రశ్నించగా.. సంబంధిత అధికారులు ఇందుకు సిద్ధంగా ఉన్నప్పుడు వెల్లడిస్తారని చెప్పారు. ఉగ్రవాదం అనేది ఏ రెండు దేశాలకో సంబంధించిన అంశంగా చూడరాదని, ప్రపంచ సమస్యగానే చూడాలని అన్నారు. ఈ సమావేశంలో బెల్జియం విదేశాంగ మంత్రి మాక్సిమ్ ప్రెవోట్ సైతం పాల్గొన్నారు.

## ఆషాఢ బోనాలకు 20 కోట్లు విడుదల

(మొదటి పేజీ తరువాయి)

సమస్యలు లేకుండా నిర్వహించాలని ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి తెలిపారు. వీఐపీ మూమెంట్‌లో తొక్కిసలాటలు జరుగుతున్నాయని, అవి జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు- చెప్పారు. జోగినీలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని.. గతంలో జరిగిన దానికంటే ఇంకా మంచిగా బోనాల ఉత్సవాలు జరపాలని అనుకుంటున్నామని మంత్రి కొండా సురేఖ చెప్పారు. సరస్వతి పుష్కరాలు కూడా అద్భుతంగా నిర్వహించామని.. పక్క రాష్ట్రాల భక్తులు కూడా ఎంతో అభినందించారని అన్నారు. అధికారులు సమన్వయంతో ఉండి డ్యూటీ చేయాలని.. సంయమనం పాటించాలని కోరుతున్నామన్నారు. భక్తులతో దురుసుగా ప్రవర్తించకుండా మర్యాద పూర్వకంగా వ్యవహరిస్తూ దర్శనం చేయించాలన్నారు. గత ఏడాది బోనాల సమయంలో పొన్నం ప్రభాకర్ వీడియో వైరల్ అయిందని.. ఈసారి ఎలాంటి తప్పిదాలు జరగకుండా ఎవరి డ్యూటీ వారు సక్రమంగా చేయాలని మంత్రి కొండా సురేఖ అధికారులకు సూచించారు. గోల్కొండ జగదాంబిక అమ్మవారి తొలి బోనంతో బోనాల ఉత్సవాలు ప్రారంభం అవుతాయన్నారు. గోల్కొండ జాతర, బల్కంపేట ఎల్లమ్మ తల్లి వార్షిక కల్యాణోత్సవం, లష్కర్, లాల్ దర్వాజ బోనాలు, అమ్మవారి అంబారి ఊరేగింపు, రంగం కార్యక్రమాలు అన్ని సక్రమంగా జరిగేలా యాక్షన్ ప్లాన్ రెడీ చేస్తున్నామని మంత్రి చెప్పారు. ఈసారి బోనాలకు ప్రభుత్వం రూ. 20 కోట్లు- విడుదల చేసిందన్నారు. నూతన దేవాలయాలు యాడ్ అయ్యాయి కాబట్టి ఇంకో 10 శాతం ఫండ్స్ రిలీజ్ చేయాల్సిన అవసరం ఉందని మంత్రి అభిప్రాయం వ్యక్తం చేశారు. ఎండోమెంట్, రెవెన్యూ డిపార్ట్‌మెంట్ చెక్కులు డిస్ట్రిబ్యూషన్ కార్యక్రమం త్వరగా పూర్తి చేయాలన్నారు. డ్యూటీ లా కాకుండా ప్రతి ఒక్కరు అమ్మవారి ఆజ్ఞతో సేవ చేస్తున్నామని అనుకోవాలన్నారు. అమ్మవారి ఆశీర్వాదంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా కార్యక్రమం జరగాలని కోరుకుంటు-న్నట్లు- మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. ఈ ఏడాది తొలి బోనం జూన్ 26న చారిత్రాత్మక గోల్కొండ కోటలో ప్రారంభం కానుందని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. తర్వాత వరుసగా బల్కంపేట ఎల్లమ్మ, ఉజ్జయిని మహంకాళి, లాల్ దర్వాజ బోనాలు జరగనున్నాయి. బోనాల పండుగను రాష్ట్ర గౌరవానికి మారు పేరుగా మార్చేందుకు ప్రభుత్వం ఇప్పటికే రూ. 20 కోట్లు- కేటాయించింది.

## ఏడాదిన్నరలో 60 వేల ప్రభుత్వ ఉద్యోగాలు

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ ప్రభుత్వం ప్రోత్సాహకాలు చూసి షైవ గ్రూప్ సంస్థ పెట్టుబడులు పెట్టేందుకు ఒప్పుకుందని తెలిపారు. తెలంగాణలో షైవా గ్రూప్ భాగస్వామిగా మారిందని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. షైవా గ్రూప్, టారానిస్ క్యాపిటల్ కలిపి రాష్ట్రంలో రూ.2,125 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో మంగళవారం అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. బయోసైన్స్, కృత్రిమ మేధలో పెట్టుబడులకు తెలంగాణ అనుకూల ప్రదేశమన్నారు. తెలంగాణ పురోగతిలో భాగస్వామ్యమయ్యేందుకు ముందుకు వచ్చిన సంస్థలకు అభినందనలు తెలిపారు. రాష్ట్ర ప్రజలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఏడాదిన్నరలో 60వేల ప్రభుత్వ ఉద్యోగాలు, ప్రైవేటు రంగంలో లక్షకు పైగా ఉద్యోగ అవకాశాలు కల్పించామన్నారు. ఏడాదిన్నరలో రూ.3లక్షల కోట్లకు పైగా పెట్టుబడులకు అవగాహన ఒప్పందాలు కుదిరాయని చెప్పారు. ప్రభుత్వంపై నమ్మకంతో పెట్టు-బడిదారులు ముందుకు వస్తున్నారన్నారు. యువత మన ఆస్తి.. వారిలో నైపుణ్యాలు నింపేందుకు స్కిల్ యూనివర్సిటీ- ఏర్పాటు- చేశామని తెలిపారు. రాష్ట్రం అవకాశాల గని.. ఆవిష్కరణలకు, అవకాశాలకు, ప్రతిభకు కేంద్రమని పేర్కొన్నారు. అంతర్జాతీయ భాగస్వాములను రాష్ట్రం ఆకర్షిస్తోందన్నారు. 18 నెలల్లో 3 లక్షల కోట్ల పెట్టుబడులకు ఎంఓయూలు కుదిరాయని, లక్ష మందికి తెలంగాణ యువతకు ఉపాధి లభించిందని మంత్రి శ్రీధర్ బాబు చెప్పుకొచ్చారు. 'తెలంగాణ ప్రభుత్వం కొత్త పరిశ్రమలకు మెరుగైన అవకాశాలు కల్పిస్తోంది. తెలంగాణ ప్రభుత్వం ప్రోత్సాహకాలు చూసి శైవ గ్రూప్ సంస్థ పెట్టుబడులు పెట్టేందుకు ఒప్పుకుంది.13 వందల కోట్లతో బయోటెక్ సంస్థ పెట్టుబడులు పెడుతున్నారు. ఐదు సంస్థల్లో 2100 కోట్లు-, 5 వేల మందికి ఉపాధి కలగనుంది. సాంకేతిక పరమైన కొత్త ఆవిష్కరణలకు ప్రభుత్వం పెట్టుబడి దారులకు సహకారం అందిస్తుంది. 18 నెలల్లో 3 లక్షల కోట్ల పెట్టుబడులకు ఎంఓయూలు, లక్ష మందికి తెలంగాణ యువతకు ఉపాధి లభించింది. కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి అడుగు నుంచే విమర్శలు చేస్తున్నారు.

## రాబోయే మూడురోజులు భారీ వర్షాలు..!

(మొదటి పేజీ తరువాయి)

జనగాం సిద్ధిపేట యాదాద్రి భువనగరి, రంగారెడ్డి హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని పేర్కొంది.ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. బుధవారం జయశంకర్ భూపాలపల్లి, ములుగు, వికారాబాద్ మహబూబ్‌నగర్, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఉరుములు, మెరుపులు, గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని చెప్పింది. గురువారం వికారాబాద్, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాలలో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని వివరించింది. ఇదిలా ఉండగా.. గడిచిన 24గంటల్లో ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో తేలిక నుంచి భారీ వర్షాలు కురిశాయి. నిజామాబాద్ జిల్లా కుబీర్ 7.2, కామారెడ్డి జిల్లా మద్నూర్‌లో 7, నర్సాపూర్ (జీ)లో 6.8, ఆదిలాబాద్ అర్బన్‌లో 6.7 సెంటీమీటర్ల వర్షాపాతం నమోదైందని టీజీడీపీఎస్ వివరించింది.

తెలంగాణ వీణ
తెలంగాణ వీణ ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలకైనా సంప్రదించండి
8328209811

## దేశంలో తగ్గుతున్న పేదరికం..
### స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నివేదిక



**తెలంగాణవీణ,న్యూఢిల్లీ**
దేశంలో పేదరికం క్రమంగా తగ్గుతోందని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తాజా నివేదిక స్పష్టం చేసింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో 5.3 శాతంగా ఉన్న పేదరికం.. 2023-24 ఆర్థిక సంవత్సరంలో 4.6 శాతానికి తగ్గిందని ఎస్బీఐ తన రిపోర్టులో తెలిపింది. దేశంలో పేదరికం విషయంలో ఎస్బీఐ నివేదిక, ప్రపంచ బ్యాంక్ నివేదిక దాదాపు ఒకే విధంగా ఉన్నాయి.ప్రపంచ బ్యాంక్ కూడా దేశంలో పేదరికం క్రమంగా తగ్గుతోంది. 2023లో 5.3 శాతంగా ఉన్న పేదరికం ఇప్పుడు 4.6 శాతానికి తగ్గిందని తెలిపింది. పేదరిక నిర్మూలనలో దేశం పురోగతి సాధిస్తున్నదనడానికి ఇది నిదర్శనమని ఎస్బీఐ పేర్కొంది. 2011-12 ఆర్థిక సంవత్సరంలో దేశంలో పేదరికం 27.1 శాతంగా ఉండెనని ఎస్బీఐ తన రిపోర్టులో పేర్కొంది. ఇదిలావుంటే ప్రపంచ బ్యాంక్ ఇటీవల గ్లోబల్ పావర్టీ లైన్‌ను సవరించింది. గతంలో రోజుకు 2.15 అమెరికా డాలర్ల కంటే తక్కువ సంపాదన ఉన్నవారిని పేదలుగా పరిగణించగా.. ఇప్పుడు దాన్ని మూడు డాలర్లకు పెంచింది. అంటే రోజుకు రూ.260 కంటే తక్కువ సంపాదన కలిగి వారిని పేదలుగా పరిగణలోకి తీసుకుంది. ప్రపంచ బ్యాంకు నివేదిక ప్రకారం.. 2011-12లో దేశంలోని మొత్తం నిరుపేదల్లో 65 శాతం మంది కేవలం ఉత్తరప్రదేశ్, బీహార్, పశ్చిమబెంగాల్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లోనే ఉన్నారు. 2011-12లో రూరల్ ఇండియాలో 18.4 శాతం నిరుపేదరికం ఉండగా.. 2022-23లో అది 2.8 శాతానికి తగ్గింది. అదేవిధంగా 2011-12లో అర్బన్ ఇండియాలో 10.7 శాతం నిరుపేదరికం ఉండగా.. 2022-23 నాటికి అది 1.1 శాతానికి దిగివచ్చింది.

## సాయుధ దళాలను ప్రశంసిస్తూ బెంగాల్ అసెంబ్లీ తీర్మానం



**తెలంగాణవీణ,హైదరాబాద్**
కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే పహెల్గాం ఉగ్రదాడి జరిగిందని పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఆరోపించారు.మంగళవారం ఆమె రాష్ట్ర అసెంబ్లీలో ప్రసంగించారు. దాడి జరిగిన ప్రదేశంలో భద్రతా సిబ్బంది ఎందుకు లేరని ప్రశ్నించారు. సాయుధ దళాల ధైర్య సాహసాలను సైతం కేంద్రం రాజకీయం చేయడానికి ప్రయత్నిస్తోందని విమర్శించారు. దేశ ప్రజలకు భద్రత కల్పించడంలో బీజేపీ తీవ్రంగా విఫలమైందన్నారు. భద్రత కల్పించడంలో విఫలమైందున ప్రభుత్వం వెంటనే దిగిపోవాలని డిమాండ్ చేశారు. దాడికి పాల్పడిన ఉగ్రవాదులు ఎక్కడి నుంచి వచ్చారు? వారికి ఆయుధాలు ఎలా వచ్చాయి? ఇంకా ఎవరినీ ఎందుకు పట్టుకోలేదు? అని ప్రశ్నించారు.రెండు దేశాల మధ్య సైనిక ఘర్షణ జరిగిన సమయంలో పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను భారత్ తన ఆధీనంలోకి తీసుకునే అవకాశం కలిగిందన్నారు. ఈ మేరకు రాష్ట్ర అసెంబ్లీలో సాయుధ దళాలను ప్రశంసిస్తూ అధికార తృణమూల్ కాంగ్రెస్ (TMC) ఓ తీర్మానాన్ని ఆమోదించింది.

## రానున్న మూడు రోజులు తీవ్ర వేడి గాలులు..
### ఢిల్లీకి ఐఎండీ రెడ్ అలర్ట్




**తెలంగాణవీణ, న్యూఢిల్లీ**
దేశ రాజధాని ఢిల్లీకి వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. రానున్న మూడు రోజులు రాజధానిలో ఎండ తీవ్రత అధికంగా ఉంటుందని తెలిపింది. గురువారం వరకూ వేడిగాలుల తీవ్రత ఎక్కువగా ఉంటుందని హెచ్చరించింది. ఉష్ణోగ్రతలు 44 నుంచి 45 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. ఈ మేరకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. అయితే, సాయంత్రం సమయంలో వాతావరణం చల్లబడుతుందని తెలిపింది. వారాంతంలో భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ అంచనా వేసింది.కాగా, సోమవారం ఢిల్లీలోని అనేక ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యాయి. సఫ్దర్‌జంగ్‌లో 43.4 డిగ్రీల సెల్సియస్, పాలెంలో 44.3 డిగ్రీల సెల్సియస్, లోధి రోడ్డులో 43.3 డిగ్రీల సెల్సియస్, రిడ్జ్‌లో 44.9 డిగ్రీలు, అయా నగర్‌లో 45.3 డిగ్రీల సెల్సియస్‌గా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో నిన్న రాజధానిలో ఐఎండీ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.

## కర్నాటకలో మరోసారి కులగణన సర్వే




**తెలంగాణవీణ, కర్ణాటక**
కులగణనతోనే సామాజిక న్యాయం సాధ్యమని పలు రాష్ట్ర ప్రభుత్వాలు కులగణను చేపడుతున్నాయి. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న తెలంగాణ, కర్ణాటకలో పూర్తైంది. మరోసారి కులగణన సర్వే నిర్వహించాలని కాంగ్రెస్ కేంద్ర నాయకత్వం ఆదేశించిందని ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్ ఇవాళ తెలిపారు. రాష్ట్రంలో మరోసారి కులగణన చేయనున్నట్లు డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ప్రకటించారు. విమర్శలకు తావు లేకుండా కులగణన చేపట్టాలని కాంగ్రెస్ హైకమాండ్ సూచించినట్లు తెలిపారు.జూన్ 12న కర్ణాటక మంత్రి వర్గం ప్రత్యేకంగా సమావేశం కానుందని ఆయన తెలిపారు. కాగా, కర్ణాటకలో 2015లోనే అప్పటి ప్రభుత్వం కుల గణన జరిపింది. హెచ్ కాంతారాజ్ నేతృత్వంలో కర్ణాటక రాష్ట్ర బీసీ కమిషన్ ఈ సర్వేను నిర్వహించింది. ఆ సమయంలో కోటి 35 లక్షల ఇళ్లను సర్వే చేశారు. 51 ప్రమాణాల ఆధారంగా 5.98 కోట్ల మంది డాటాను సేకరించారు. అయితే.. రాజకీయపరమైన కారణాలు, ఇతర కారణాల దృష్ట్యా ఆ నివేదికను సీల్డ్ కవర్‌లోనే ఉంచారు.

## భారత్-మయన్మార్ సరిహద్దుల్లో వరుస భూకంపాలు..
### -36 గంటల్లో ఏకంగా..



**తెలంగాణవీణ, న్యూఢిల్లీ**
భారత్-మయన్మార్ సరిహద్దుల్లో వరుస భూకంపాలు సంభవించాయి. గత 36 గంటల్లో ఏకంగా ఆరుసార్లు భూమి కంపించింది. రిక్టరు స్కేలుపై భూకంపం తీవ్రత 3.8 నుంచి 4.5 మధ్య నమోదైంది. చివరిసారిగా మంగళవారం ఉదయం 11:21 గంటల సమయంలో 4.3 తీవ్రతతో భూమి కంపించింది. ఈ ప్రకంపనల ధాటికి ఈశాన్య రాష్ట్రం మణిపూర్ లోనూ భూమి కంపించింది. వరుస భూ ప్రకంపనలతో సరిహద్దు ప్రాంతాల్లోని ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. అయితే, ప్రకంపనలు స్వల్ప స్థాయిలోనే ఉండటంతో ప్రాణ, ఆస్తి నష్టం సంభవించలేదు.కాగా, ఈ ఏడాది మార్చి 28న మయన్మార్‌లో భారీ భూకంపం సంభవించిన విషయం తెలిసిందే. రిక్టరు స్కేలుపై 7.7 తీవ్రతతో భూమి కంపించింది. ఈ శక్తిమంతమైన భూకంపం ధాటికి భారీగా ప్రాణ, ఆస్తి నష్టం సంభవించింది. అనేక భవనాలు నేలమట్టమయ్యాయి. మయన్మార్ అధికారుల ప్రకారం.. ఈ విపత్తులో దాదాపు 4 వేల మంది ప్రాణాలు కోల్పోయారు. వేల సంఖ్యలో ప్రజలు గాయపడ్డారు. ఈ భూకంపం ధాటికి పొరుగున ఉన్న థాయ్‌లాండ్‌లోనూ ప్రకంపనలు చోటు చేసుకున్న విషయం తెలిసిందే. ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ రెడ్ క్రాస్ అండ్ రెడ్ క్రెసెంట్ సొసైటీస్ (IFRC) ప్రకారం.. ఈ ప్రకృతి విపత్తు కారణంగా దాదాపు 200,000 మంది ప్రజలు నిరాశ్రయులయ్యారు. ఇక మధ్య మయన్మార్‌లోని కొన్ని ప్రాంతాలు ప్రతిరోజూ కుదుపులకు గురవుతున్నాయి.

## రకరకాల డ్రోన్లు, మిస్సైళ్లతో రష్యా దాడి



**తెలంగాణవీణ, కీవ్**
ఉక్రెయిన్‌పై మంగళవారం రష్యా దాడి చేసింది. రకరకాల డ్రోన్లు, మిస్సైళ్లతో అటాక్ చేసింది. కీవ్‌లోని రెసిడెన్షియల్ ప్రాంతాలతో పాటు ఒడిసా నగరంలోని మెటర్నిటీ ఆస్పత్రిని టార్గెట్ చేశారు. రష్యా తన అటాక్ సమయంలో 315 షాహిద్ టైప్ యూఏవీలను, డెకాయ్ డ్రోన్లు, రెండు కేఎన్-23 బాలిస్టిక్ మిస్సైళు, అయిదు ఇస్కాండర్ కే క్రూయిజ్ మిస్సైళ్లను వాడింది. ఉక్రెయిన్ రాజధాని కీవ్‌నే ప్రధానంగా టార్గెట్ చేశారు. అటాక్ తర్వాత అనేక జిల్లాల్లో ఎమర్జెన్సీ సర్వీసులు నిర్వహిస్తున్నామని కీవ్ మేయర్ విటాలీ క్లిచ్‌కో తెలిపారు.మంగళవారం ఉదయం కీవ్ అధికారులు స్థానిక ప్రజలకు వార్నింగ్ ఇచ్చారు. ఒడిసా పట్టణంపై కూడా మంగళవారం భీకర దాడులు జరిగాయి. రష్యాకు చెందిన వైమానిక టార్గెట్లను నిర్వీర్యం చేశామని, 322 టార్గెట్లలో 284 కూల్చినట్లు ఉక్రెయిన్ వైమానిక దళం పేర్కొన్నది. కీవ్, ఒడిసా, డిన్‌ప్రో, చెర్నిహైవ్ ప్రాంతాలపై అతిపెద్ద దాడి జరిగినట్లు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తెలిపారు.

## ఢిల్లీలో ఘోర అగ్ని ప్రమాదం..
### బాల్కనీ నుంచి దూకి తండ్రి, ఇద్దరు పిల్లలు మృతి



**తెలంగాణవీణ, ఢిల్లీ**
దేశ రాజధాని ఢిల్లీ లో ఘోర అగ్ని ప్రమాదం సంభవించింది. ద్వారకా ప్రాంతంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో మంగళవారం ఉదయం పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు.ద్వారకా సెక్టార్-13 లోని శపథ సొసైటీలో మంగళవారం ఉదయం 9:58 గంటల ప్రాంతంలో ఈ ఘటన చోటు చేసుకుంది. అపార్ట్‌మెంట్‌లోని ఎనిమిది, తొమ్మిది అంతస్తుల్లో మంటలు చెలరేగాయి. క్షణాల్లోనే మంటలు పెద్ద ఎత్తున ఎగసిపడ్డాయి. దీంతో అప్రమత్తమైన నివాసితులు ప్రమాదం నుంచి తప్పించుకునే క్రమంలో భవనంపై నుంచి కిందకు దూకేశారు. అలా ప్రాణాలను కాపాడుకునే క్రమంలో తండ్రి, ఇద్దరు పిల్లలు ప్రాణాలు కోల్పోయారు. ముందుగా పదేళ్ల ఇద్దరు చిన్నారులు ప్రమాదం నుంచి బయటపడేందుకు బాల్కనీ నుంచి కిందుకు దూకేశారు. పిల్లల తండ్రి 35 ఏళ్ల యష్ యాదవ్ కూడా కిందకు దూకాడు. దీంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. అధికారులు వారిని సమీపంలోని ఆసుపత్రులకు తరలించగా.. అప్పటికే వారు ప్రాణాలు కోల్పోయినట్లు వైద్యులు నిర్ధరించారు. పలువురు నివాసితులు ఈ మంటల్లో చిక్కుకుపోయినట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక అధికారులు వెంటనే ఘటనా స్థలికి చేరుకొని ఎనిమిది ఫైరింజన్ల సాయంతో మంటలను ఆర్పివేస్తున్నారు. భవనంలో చిక్కుకుపోయిన వారిని రక్షించేందుకు ప్రయత్నిస్తున్నారు. అగ్నిప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు.


GS9TV తెలుగు
తెలంగాణ వీణ
నిజం నిగ్గు తేలుద్దాం..
తెలుగు దినపత్రిక
విలేకరులు కావలెను
అతి కొద్ది కాలంలోనే ప్రజలకు ప్రజాప్రతినిధులకూ వారధి గా ప్రదర్శింపబడుతున్న
GS9TV కేబుల్ ఛానల్, తెలంగాణ వీణ తెలుగు దినపత్రికకు
అన్నీ జిల్లాల నుండి విలేకరులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి.
సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లు
8328209811
9703024024


## మూడు నెలల్లో ఢిల్లీని నాశనం చేశారు..
### బీజేపీపై అర్వింద్ కేజ్రీవాల్ విమర్శలు




**తెలంగాణవీణ,న్యూఢిల్లీ**
బీజేపీ సర్కారు అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే ఢిల్లీని నాశనం చేసిందని ఆమ్‌ఆద్మీ పార్టీ కన్వీనర్, ఢిల్లీ మాజీ సీఎం అర్వింద్ కేజ్రీవాల్ విమర్శించారు. ఈ మేరకు ఆయన తన అధికారిక ఎక్స్ ఖాతాలో ఒక పోస్టు పెట్టారు. ఢిల్లీ మాజీ సీఎం, ప్రస్తుత ప్రతిపక్ష నాయకురాలు అతిషిని పోలీసులు అరెస్ట్ చేసిన నేపథ్యంలో కేజ్రీవాల్ ఈ పోస్టు పెట్టారు.కూల్చివేతలకు వ్యతిరేకంగా కల్కాజీలోని భూమిహీన్ క్యాంపులో జరుగుతున్న ఆందోళనల్లో ఇవాళ అతిషి పాల్గొన్నారు. దాంతో ఢిల్లీ పోలీసులు ఆమెను అరెస్ట్ చేశారు. ఈ నేపథ్యంలో కేజ్రీవాల్ సోషల్ మీడియా ద్వారా స్పందించారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో బీజేపీ ఢిల్లీని సర్వనాశనం చేసిందని విమర్శించారు.

## సంపాదకీయం

# అక్షర సంకల్పానికి తూట్లు !

ప్రతి ఆవాసంలోనూ స్కూలు పెట్టి పిల్లలకు విద్యను చేరువ చేయాలన్న సంకల్పంతో ఏర్పాటు చేసిన ఏకోపాధ్యా పాఠశాలలు కనుమరుగు అయ్యాయి. ప్రభుత్వ పాఠశాలలను ఓ క్రమపద్ధతిలో ప్రైవేట్ పాఠశాలలు మింగేశాయి. దీంతో మారుమూల గ్రామాల ప్రజలకు ప్రైవేట్ స్కూళ్లు దిక్కయ్యాయి. వారు మెల్లగా గ్రామాలకు బస్సులను పెట్టి, మండల కేంద్రాల్లో స్కూళ్లు పెట్టి, అందమైన బొమ్మలు చూపి ముగ్గులోకి దించుతూ వచ్చారు. ఇలాగత దశాబ్దకాలంగా ప్రైవేట్ స్కూళ్ల విజృంభణతో ప్రభుత్వ పాఠశాల లు కనుమరుగు అయ్యాయి. ఉమ్మడి ఎపిలో ఇలా అనేక స్కూళు మూతపడ్డాయి. రాష్ట్ర విభజన తరవాత కూడా పాలకులు ఇదే ధోరణి అవలంబించడంతో అనేక పాఠశాలలు మూతపడ్డాయి. డిఎస్సీల గొడవ, జీతాల గొడవ లాంటివి లేకుండా చేసే కుట్రలో భాగంగా అనేక స్కూళ్లను మూసేశారు. ఘనత వహించిన తెలంగాణలో కెసిఆర్ సర్కార్ ఈ విషయంలో వడివడిగా అడుగులు వేసింది. అందుకే విద్యారంగంలో తీసుకున్న చర్యలు క్షేత్రస్థాయిలో ఎలాంటి ప్రభావం చూపలేదు. పేదలకు విద్య అందించాలన్న ఆలోచన లేకుండా ప్రభుత్వాలు నిర్ణయాలు తీసుకున్నాయి. ఇంగ్లీష్ మీడియం ఆశ చూపి స్కూళ్ల విలీనంతో చిన్నపిల్లలు తమ సమీప స్కూళ్లకు వెళ్లే అవకాశం కోల్పోయేలా చేసిన ఘనతను నాటి సిఎం జగన్ సాధించారు. ఒకప్పుడు విద్యను గ్రామస్థాయికి తీసుకుని వెళ్లాలన్న సంకల్పంతో ఏకోపాధ్యాయ పాఠశాలలను ప్రారంభించారు. చిన్న గ్రామానికి కూడా స్కూలు ఉండాలన్న సంకల్పం వచ్చింది. అక్కడ ఒక్కరే టీచర్‌ను నియమించి నడిపించారు. దీంతో అనేక గ్రామాల్లో ఏకోపాధ్యాయ స్కూళ్లు ఏర్పడ్డాయి. తల్లిదండ్రులు తమపిల్లలను ఉన్న ఊర్లోని స్కూలుకు పంపడం వల్ల అక్షరజ్ఞానం వచ్చింది. ఇది అక్షరాస్యతకు తోడ్పడింది. అక్షరాస్యతను పెంచే క్రమంలో ఇదో విప్లవాత్మక చర్యగా చూడాలి. ఈ లక్ష్యం దెబ్బతినకుండా ప్రభుత్వాలు మరింత పకడ్బందీగా విద్యావ్యవస్థను అమలు చేయాల్సింది పోయి వాటిని మూతేశారు. ప్రభుత్వాలు జీతాల భారం తగ్గించుకునే క్రమంలో స్కూళ్ల విలీనం చర్యలకు పూనుకున్నాయి. దీనివల్ల సామాన్యులకు ప్రభుత్వ విద్య దూరం అయ్యింది. ఇది కూడా కార్పోరేట్ కుట్రలో భాగమే అని చెప్పాలి. వారు వెనకవుండి ఆడించిన కారణంగానే ప్రభుత్వాలు ఈ చర్యలకు దిగాయి. ఈ సమస్యను అర్థం చేసుకోకుండా ప్రాథమిక పాఠశాలలను.. ప్రాథమి కోన్నత, ఉన్నత విద్యాపాఠశాలల్లో విలీనం చేసారు. గతంలో పాలించిన జగన్ నాయకత్వంలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పై విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర నిరసన వ్యక్తం అయ్యింది. మా పాఠశాలను వేరే పాఠశాలలో విలీనం చేయవద్దంటూ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చేశారు. నిజానికి ప్రతి గ్రామానికి పాఠశాల ఉండాలన్న సంకల్పం దెబ్బతనికుండా చూడాల్సిన ప్రభుత్వం విలీనం పేరుతో ఇలా చేయడంతో సామాన్యులకు విద్యను దూరం చేశారు. అలాగే ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఇదే తంతు కొనసాగింది. ఇలా వందలాది పాఠశాలలను మూసివేశారు. ఇదంతా కుట్రపూరితంగా జరిగిన కార్యక్రమంగా గుర్తించాలి. దీంతో ప్రైవేట్ విద్యా సంస్థలు తమ విస్తరణకు అవకాశంగా తీసుకున్నాయి. గ్రామాలకు బస్సులను నడుపుతూ, మండల కేంద్రాల్లో స్కూళ్లను పెడుతూ, వాటిని పెంచుకుంటూ వచ్చారు. దీంతో విధిలేక తల్లిదండ్రులు ఇంటిముందుకు వచ్చే బస్సులో తమ పిల్లలను ప్రైవేట్ స్కూళ్లకు పంపుతున్నారు. దీంతో వారిపై ఆర్థికభారం పడుతోంది. అనివార్యంగా ఇప్పుడు గ్రామాల్లో ప్రజలు తమ పిల్లను ప్రైవేట్ స్కూల్లకు బలిచేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం పెట్టాలన్న సంకల్పం మంచిదే అయినా గ్రామాలకు పాఠశాలలను దూరం చేయడం మాత్రం సరికాదు. ప్రాథమిక పాఠశాలలను విలీనం చేయడం ద్వారా తమ పిల్లలు బడులకు దూరమవుతారంటూ తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్న తీరు ప్రభుత్వం వెంటనే గుర్తించి దిద్దుబాటు చర్యలు తీసుకోవాలి. సంస్కరణల పేరుతో పాఠశాలలను మూసివేస్తామంటే ఎలాగని గతంలోనే ఎపి హైకోర్టు నిలదీసింది. జాతీయ విద్యావిధానమంటూ విద్యాహక్కు చట్టానికి విరుద్ధంగా పాఠశాలల విలీనం, ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణ ఎలా చేపడతారని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. విద్యాహక్కు చట్టం మేరకు విద్యార్థులు, ఉపాధ్యాయుల నిష్పత్తిని పాటిస్తున్నట్లు కనిపించడం లేదని కూడా హైకోర్టు అభిప్రాయ పడింది. ప్రాథమిక విద్య మాతృభాషలోనే ఉండాలని విద్యా హక్కు చట్టం చెబుతోంది. సర్కారు చర్యలు విద్యా వ్యవస్థను బలపరిచేలా ఉండాలే కానీ నిర్వీర్యం చేసేలా ఉండకూడదని పాలకులగుర్తించడం లేదు. నూతన విద్యా విధానం అమలు పేరుతో పాఠశాల విద్య దెబ్బతినకుండా, పిల్లలకు పాఠశాలలు దూరం కాకుండా చూసుకోవాలి. పాఠశాలల విలీనం, ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణ ద్వారా స్కూళ్ల సంఖ్యను తగ్గించే ప్రయత్నం చేయరాదు. స్కూళ్లను పెంచి, సౌకర్యాలు కల్పించి, టీచర్లను పెంచడం ద్వారా మరింత పటిష్టంగా ప్రభుత్వ విద్య అమలయ్యేలా చూడాలి. ప్రభుత్వ అనాలోచిత చర్య కారణంగా చిన్నారులు, బాలికలు చదువుకు దూరమయ్యే ప్రమాదం ఉంది. విద్యారంగం అన్నది ఏ రాష్ట్రానికైనా ప్రాధాన్యరంగం కావాలి. ఏకోపాధ్యా స్కూళ్లను మరింతగా మెరుగు పరచి ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాలి.

# ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు అందజేసిన ఎమ్మెల్యే కుంభం





**తెలంగాణ వీణ, వలిగొండ (ప్రతినిధి )**
న అర్హులైన లబ్ధిదారులు తమ శక్తి మేరకు మాత్రమే ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకోవాలని భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని దేవిశ్రీ గార్డెన్ లో జరిగిన ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన పత్రాలను ఎమ్మెల్యే కుంభం అనిల్ రెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు 400 నుండి 600 లోపు చదరపు అడుగుల మధ్యలోపు ఇండ్లు నిర్మించుకోవాలని సూచించారు. మండల వ్యాప్తంగా మంజూరైన 586 ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరయ్యాయని,పెండింగ్ లో ఉన్న మిగతా లబ్ధిదారులకు వారం రోజుల్లో పూర్తి చేస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పారదర్శకంగా చేపట్టామని అన్నారు. ఇళ్ల లబ్ధిదారులకు ప్రభుత్వం నాలుగు విడతల వారిగా రూ.5 లక్షలను మంజూరు చేస్తుందని అన్నారు. నెలరోజుల్లో నిర్మాణాలు ప్రారంభించాలని, లేని పక్షంలో మంజూరైన ఇళ్లు రద్దు అయ్యే అవకాశాలుంటాయని పేర్కొన్నారు. ఇంటి నిర్మాణంలో పూర్తి సహకారం ప్రభుత్వం అందిస్తోందని, నిర్మాణాలకు ఇసుకను ఉచితంగా సరఫరా చేస్తామన్నారు. ఇళ్ల నిర్మాణంలో నిధుల మంజూరుకు లబ్ధిదారులు అధికారులు, దళారులను ఆశ్రయించవద్దని స్పష్టం చేశారు. నయా పైసా చెల్లించాల్సిన అవసరం లేదని అన్నారు. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను చేపట్టి పనులను వేగవంతం చేసి ఇందిరమ్మ ఇంటి కలను సాకారం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పాశం సత్తిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు కంకల కిష్టయ్య, ఎఎంసి చైర్మన్ భీమా నాయక్, మత్స్యగిరి గుట్ట చైర్మన్ కొమ్మాడి నరేష్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ సురకంటి వెంకట్ రెడ్డి, ఆర్డిఓ శేఖర్ రెడ్డి, తహసిల్దార్ దశరథ, ఎంపీడీవో జితేందర్ రెడ్డి, మాజీ ఎంపీపీలు నూతి రమేష్, కేశిరెడ్డి నీరజారెడ్డి, మాజీ సర్పంచులు పబ్బు ఉపేందర్ బోస్, మల్లం శ్రీనివాస్, బత్తిని సహదేవ్, కాసుల వెంకన్న, కొండూరు సాయి, భాస్కర్, ఇక్కుర్తి స్వామి, కాటం గణేష్ వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు రెవిన్యూ సిబ్బంది నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## శరీర దారుఢ్యానికి, మానసికోల్లాసానికి కరాటే శిక్షణ అవసరం : రాజ్ కుమార్ రెడ్డి

-విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి
-కరాటే,కిక్ బాక్సింగ్ విద్యార్థులకు బెల్టులు, మెడల్స్,షీల్డుల అందజేత





**తెలంగాణ వీణ, ఎల్బీనగర్ నియోజకవర్గ ప్రతినిధి**
శరీర దారుఢ్యానికి, మానసికోల్లాసానికి కరాటే శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కె.రాజ్ కుమార్ రెడ్డి అన్నారు. యొద్ద గోజురియు స్పోర్ట్స్ కరాటే డు ఆర్గనైజేషన్ ఇండియా మాస్టర్ తీగల శ్రీనివాస్,కిక్ బాక్సింగ్ కోచ్ అరుణ్ సింగ్ ఆధ్వర్యంలో కరాటే,కిక్ బాక్సింగ్ విభాగాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థినీ విద్యార్థులకు మంగళవారం ఉదయం హైదరాబాద్ ఎల్బీనగర్ లో బెల్టుల ప్రదానోత్సవాన్ని ఏర్పాటు చేశారు.బెల్టుల ప్రదానోత్సవానికి భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కె.రాజ్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు బెల్టుల ప్రదానం చేయడంతో పాటు మెడల్స్,షీల్డ్స్ ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు చదువుతో పాటు క్రీడారంగంలో రాణించేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. కరాటే, కిక్ బాక్సింగ్ విభాగాల్లో విద్యార్థినీ విద్యార్థులకు మాస్టర్లు మంచి తర్ఫీదును ఇస్తున్నారని మాసర్ శ్రీనివాస్, కోచ్ అరుణ్ సింగ్ లను అభినందించారు. అంతకుముందు రాజ్ కుమార్ రెడ్డిని మాస్టర్లు శాలువలతో సత్కరించి, షీల్డ్ ను బహూకరించారు. ఈ కార్యక్రమంలో కోచ్ కార్తీక్,కిక్ బాక్సింగ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు దేవేందర్,అధిక సంఖ్యలో విద్యార్థినీ విద్యార్థులు,వారి తల్లిదండ్రులు,మాస్టర్లు పాల్గొన్నారు.

## రాజీమార్గమే రాజమార్గం 14న జరిగే లోక్ అదాలత్ ను వినియోగించుకోవాలి

మండల్ లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్,సీనియర్ సివిల్ జడ్జి జి సబిత పిలుపు



**తెలంగాణ వీణ,రామన్నపేట ప్రతినిధి**
రాజీమార్గమే రాజ మార్గం 14 జూన్ 25 న జరిగే జాతీయ లోక్ అదాలత్ లో రాజీ కుదుర్చుకునే విధంగా వారిని ప్రోత్సహించాలని మండల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్ సీనియర్ సివిల్ జడ్జి సబిత గారు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్ శిరీష లు పిలుపునిచ్చారు సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో నిర్వహించిన కోఆర్డినేషన్ మీటింగ్ లో పాల్గొని మాట్లాడుతూ క్షణికావేశంలో కొన్ని నేరాలు చేస్తుంటారని ఆ నేరాలను గుర్తించి నేరస్తుల మరియు ఫిర్యాదుదారు యొక్క సమయాన్ని కాపాడుకునే విధంగా రాజీమార్గమే రాజ మార్గమని ఆ విధంగా సమస్యలు పరిష్కారం అయ్యేందుకు లోక్ ఆదళతును వినియోగించుకునే విధంగా కృషి చేయాలని వారు కోరారు ఈ కార్యక్రమంలో రామన్నపేట, మోత్కూరు,అడ్డగూడూరు ఎస్ ఐ లు మల్లయ్య, నాగరాజు,నాగరాజు.కోర్టు కానిస్టేబుల్ లు పాల్గొన్నారు.


## నూతన వధూవరులను ఆశీర్వదించిన సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మాజీ మంత్రి



**తెలంగాణ వీణ, వనపర్తి.**
ఖిల్లా ఘనపూర్ మండలం, షాపూర్ గ్రామానికి చెందిన చుక్క కృష్ణయ్య కుమార్తె మౌనిక & శివ వివాహం సోమవారం జరిగింది. మంగళవారం వారి నివాసానికి వెళ్లిన మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి. నూతన వధూవరులను అక్షింతలు వేసి ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. మాజీ మంత్రి గారి వెంట మండల బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు రాళ్ళ కృష్ణయ్య, మాజీ ఎంపిపి.కృష్ణ నాయక్, బాలీశ్వర్ రెడ్డి, సామ్య నాయక్, మాన్యం గౌడ్, కుర్వ ఆంజనేయులు, బెస్త గోపాల్, దొరేటి మహేష్, మల్లేష్ , సురేందర్, తదితరులు పాల్గొన్నారు. నూతన గృహ ప్రవేశా హాజరైన ఎస్. నిరంజన్ రెడ్డి ఘనపూర్ మండలం కమలుద్దీన్ పూర్ గ్రామం చెందిన టిఆర్ఎస్ పార్టీ మాజీ సర్పంచ్ బాలయ్య గారి ఆహ్వానం మేరకు, వారి నూతన గృహ ప్రవేశంలో సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలుపడం జరిగింది. మాజీ మంత్రి గారి బిడ్డ బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య, మాజీ ఎంపీపీ కృష్ణ నాయక్, బిఆర్ఎస్ నాయకులు బాలిశ్వర్ రెడ్డి, సామ్య నాయక్, మన్యం గౌడ్ గోపాల్, జయకర్ రెడ్డి, లక్ష్మారెడ్డి, నరేందర్ గౌడ్, చెన్నయ్య, బాగన్న, యాదయ్య గౌడ్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## స్నేహితుడికి ఆర్థిక సహాయం చేసిన తోటి స్నేహితులు

- స్నేహితుడికి అండగా తోటి క్లాస్ మెట్స్.



**తెలంగాణ వీణ, వనపర్తి.**
వనపర్తి.1991-1992 బ్యాచ్ పూర్వ విద్యార్థులు పెద్దమందడి మండలం వెల్టూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1991-1992 బ్యాచ్ కు చెందిన శంకర్ రావు కు అకస్మాత్తుగా పక్షవాతం రావడం జరిగింది. పక్షవాతంతో బాధపడుతున్న తమ స్నేహితుడి గురించి తెలుసుకొని పదవ తరగతి కలిసి చదువుకున్న తోటి స్నేహితులందరూ కలిసి 15000/- ఆర్థిక సహాయాన్ని అందించి, మానవత్వాన్ని చాటుకున్నారు. తమకు తోచిన ఆర్థిక సహాయాన్ని అందించి మానవత్వం ఉందని నిరూపించారు. శంకర్ రావు కు పక్షవాతం రావడం చాలా బాధాకరమని, ఇలాంటి కష్టకాలంలో స్నేహితునికి అండగా ఉంటామని తెలిపారు. ఆపద కాలంలో మేమున్నామని స్నేహితుడికి తోటి స్నేహితులు భరోసానిచ్చారు. శంకర్ రావు త్వరగా కోలుకోవాలని, తోటి స్నేహితులు కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో రఘు వర్ధన్ రెడ్డి, శాంతయ్య, శంకర్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# సహాయ ఉపకరణముల కై ఆన్లైన్ దరఖాస్తులు

**తెలంగాణ వీణ/ చేగుంట**

మెదక్ జిల్లా, చేగుంట మండలం, వికలాంగుల సహాయ ఉపకరణముల పంపిణీ కై ఆన్ లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డి .డబ్ల్యు. ఓ హైమావతి మంగళవారం ఒక ప్రకటన తెలిపారు.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంచే వికలాంగుల మరియు వయో వృద్ధుల సంక్షేమ శాఖ ద్వారా అవసరమైన అర్హత కల్గిన వికలాంగులకు వివిధ సహాయక ఉపకరణములు ఉచిత పంపిణి చేయుటకు గాను అన్ లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానించడం అయినదని. 2025-2026 సంవత్సరమునకు గాను మెదక్ జిల్లా కు ఈ క్రింద తెలిపిన వివిధ సహాయక ఉపకరణములు కేటాయించడమైనది. రెట్రో పిట్టేడ్ మోటో రైజ్డ్ వెహికిల్(30), బ్యాటరి వీల్ చైర్(9), మొబైలు బిజినెస్ బ్యాటరీ ట్రైసైకిల్ (12), బ్యాటరీ మినీ ట్రేడింగ్ ఆటో వెహికల్ (1), హైబ్రిడ్ వీల్చైర్ అటాచ్మెంట్ వీల్చైర్ (3) ల్యాప్టాప్ (డిగ్రీ స్టూడెంట్స్ (10), ల్యాప్టాప్ (హైయర్ ఎడ్యుకేషన్) (5), టబస్ (7), 5g స్మార్ట్ ఫోన్ (1), ట్రై సైకిల్స్ (4), వీల్ చైర్స్



(4), చంక కర్రలు (15), వినికిడి యంత్రములు(1), అంధుల చేతి కర్రలు(15), స్మార్ట్ కేన్ (7), ఎంసీర్ చప్పల్(7). పైన తెల్పిన సహాయ ఉపకరణముల మంజూరి కై అర్హత గల వికలాంగులు తేది.07.06.2025 నుండి:18.06.2025 2 https://tsobmms.cgg.gov.in 3 5 5 5 చేసుకోవచ్చును. నమోదు చేసిన దరఖాస్తుతో పాటు గా మెడికల్ బోర్డు (SADAREM) ధ్రువ పత్రము, ఆదాయ ధ్రువ పత్రము (Latest), కుల, నివాస ధ్రువ పత్రములు, వయస్సు ధ్రువ పత్రము, వైకల్యము కనిపించే పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు (3), ప్రస్తుత విద్యా సంవత్సరములో విద్యనభ్యసిస్తున్న బోనఫైడ్ మరియు కళాశాల వారి లేఖ (రెట్రో పిట్టేడ్ మోటో రైజ్డ్ వెహికిల్, లాప్ టాప్, టబస్, మొబైలు బిజినెస్ బ్యాటరీ ట్రైసైకిల్, బ్యాటరీ మినీ ట్రేడింగ్ ఆటో వెహికల్, 5 జి స్మార్ట్ ఫోన్స్ (నిరుద్యోగ శారీరక వైకల్యము గల వారు రెట్రో పిట్టెడ్ మోటో రైజ్డ్ వెహికిల్ కొరకు నోటరీ చే అట్టేస్ట్ చేయబడిన రూ.100/- నాన్ జుడిషియల్ స్టాంప్ పేపర్ పై సెల్ఫ్ డిక్లరేషన్) జతపర్చిన దరఖాస్తులు తేది: 19.06.2025 సాయంత్రం 5.00 గం.!! లోపుగా జిల్లా సంక్షేమ అధికారి, మహిళా శిశు వికలాంగుల మరియు వయో వృద్ధుల సంక్షేమ శాఖ,

మెదక్ జిల్లాయందు అందజేయవలసినదిగా తెలియజేయడమైనది.

## బోల్తా కొట్టిన ట్యాంకర్‌ను క్రేన్‌సాయంతో తొలగిస్తుండగా అగ్ని ప్రమాదం.



**తెలంగాణ వీణ,శామీర్ పేట:**

ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డపై చెట్లతో పాటు పరిసర ప్రాంతాలు దగ్ధమైన సంఘటన శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు... ముంబైకి చెందిన మహమ్మద్ ఫయాజ్ ఎంహెచ్43సీకే8786 నెంబర్ గల ట్యాంకర్‌లో కెమికల్‌ను తీసుకుని శంభాపేట్‌లోని ఎల్‌మెలో కంపెనీకి వస్తున్నాడు. శామీర్‌పేట-కీసర వైపు వెళ్తున్న క్రమంలో ఔటర్ రింగ్ రోడ్డుపై శామీర్‌పేట శివారు ప్రాంతానికి చేరుకున్న వాహనాన్ని డ్రైవర్ మద్యం మత్తులో అజాగ్రత్తగా నడుపుతుండగా సోమవారం తెల్లవారు జామున ప్రమాదవ శాత్తు ఓఆర్‌ఆర్‌పై నుంచి సర్వీస్ రోడ్డు మద్యం బోల్తా పడింది. ఆ ట్యాంకర్‌ను తొలగించి వెలికి తీసుకేందుకు మంగళవారం క్రేన్ సమాయంతో సహాయక చర్యలు చేపడుతున్న క్రమంలో కెమికల్‌తో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న శామీర్‌పేట పోలీసులు, ఫైర్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటను అదుపులోకి తీసుకువచ్చారు. అప్పటికే సర్వీస్ రోడ్డులో ఉన్న చెట్లు పూర్తిగా ధ్వంజమయ్యాయి. పోలీసులు ముందస్తు చర్యలు తీసుకోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరుగలేదు. ఈ ప్రమాదంలో దాదాపు రూ 80 లక్షల మేరకు ఆస్థినష్టం జరిగిందని అంచనా వేస్తున్నారు.

## డిప్యూటీ స్పీకర్ కు శుభాకాంక్షలు తెలియజేసిన శ్రీనివాస్ రెడ్డి



**తెలంగాణ వీణ/ చేగుంట**

మెదక్ జిల్లా, చేగుంట మండలం, నూతన డిప్యూటీ స్పీకర్ ని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి సిహెచ్ శ్రీనివాస్ రెడ్డి.తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ స్పీకర్ డోర్నకల్ శాసనసభ్యులు డాక్టర్ "రామచంద్ర నాయక్" ను ఈరోజు హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వాటర్స్ లో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేసిన దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి సిహెచ్. శ్రీనివాస్ రెడ్డి, ఈ కార్యక్రమంలో తాంద్ర విజయపాల్ రెడ్డి, సోలిపేట ప్రసాద్ రెడ్డి లు పాల్గొన్నారు.

# అభివృద్ధి కార్యక్రమాలపై ఎమ్మెల్యే మాధవరం పర్యటన





**తెలంగాణ వీణ,కూకట్ పల్లి :**

కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి తో కలిసి మంగళవారం బాలానగర్ డివిజన్లోని పలు అభివృద్ధి కార్యక్రమాలు పై పరిశీలన చేశారు. ముందుగా దిల్ ఖుష్ నగర్ లోని ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇందులో ప్రధానంగా విద్యుత్ హైటెన్షన్ లైన్లు సమస్య మరియు డ్రైనేజ్ వ్యవస్థ గురించి ప్రజలు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుగారి దృష్టికి తీసుకురాగా సమస్యను వెంటనే పరిష్కరించాలని అక్కడికక్కడే అధికారులకు సూచనలు చేశారు.. అనంతరం బాలనగర్ వార్డ్ ఆఫీసు నందు నిర్వహించిన అన్ని విభాగాల అధికారులు అసోసియేషన్ సభ్యులతో ముఖాముఖి కార్యక్రమంలో ప్రజల నుంచి వినతి పత్రాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా రాజు కాలనీలో రోడ్డు సమస్య మరియు ఇతర కాలనీలో డ్రైనేజ్, విద్యుత్తు మరియు స్ట్రీట్ లైట్ మొదలగు సమస్యలను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు దృష్టికి తీసుకు రాగా.. ఆయా సంబంధించిన విభాగ అధికారులకు సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు.అలాగే చాలామంది నిరుపేదలు ఇందిరమ్మ ఇళ్ల విషయంలో అయోమయంలో ఉన్నారని వారికి ప్రభుత్వం నుంచి తగిన వివరణ ఇవ్వాలని అధికారులకు తెలిపారు. అలాగే గత పది ఏళ్ల కాలంలో బాలానగర్ ను ఎంతో అభివృద్ధి చేసుకున్నామని ఫ్లైఓవర్లు, రోడ్లు మంచినీటి పైప్లైన్లు ఇలా అన్ని రకాల మౌలిక సదుపాయాలతో డివిజన్ ను తీర్చిదిద్దామని, కానీ నేడు కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి మాట అటు ఉంచితే నిధులు మంజూరైనా పెండింగ్ పనులు కూడా పూర్తి చేయటం లేదని అసహనం వ్యక్తం చేశారు. వెంటనే ప్రభుత్వం జోక్యం చేసుకునీ ప్రజలకు ఎక్కడ ఇబ్బంది లేకుండా మౌలిక సదుపాయాలు రోడ్లు డ్రైనేజ్ విద్యుత్ వ్యవస్థలను మెరుగ్గా అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి అన్ని విభాగాల అధికారులు, అసోసియేషన్ సభ్యులు నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## విద్యార్థుల బస్సు పాస్ పెంపు ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలి.

**ఏ బీ వీ పీ స్టేట్ జాయింట్ సెక్రెటరీ అలివేలి రాజు**




**తెలంగాణ వీణ/ఓయూ:**

పేద , బడుగు,బలహీన వర్గాల విద్యార్థుల చదువుల కొరకు బాసటగా నిలిచే ఆర్ టి సి బస్ పాస్ ధరలు పెంచుతూ టీజీ ఎస్ ఆర్ టీ సీ ఉత్తర్వులు జారీ చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. విద్యార్థుల సంక్షేమానికి పెద్ద పీట వేస్తాం,అని అనేక వాగ్దానాలు, హామీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల నెల సారి బస్ పాస్ ధరను 400 నుండి 600 రూపాయల వరకు పెంచి విద్యార్థులకు తీవ్ర అన్యాయం చేయడన్నీ చూస్తే నిజంగా కాంగ్రెస్ ప్రభుత్వనికి విద్యార్థుల భవిష్యత్తు పై ఏం మాత్రం చిత్త శుద్ధి ఉందో యావత్తు విద్యార్థి లోకానికి అర్థం అవుతుంది.ఇప్పటికే విద్యార్థుల , ఫీజు రీయింబర్స్మెంట్,స్కాలర్షిప్, ప్రభుత్వం విడుదల చేయక విద్యార్థులు వారు చదువుకొనే విద్యాసంస్థలో డబ్బులు కట్టుకొని సర్టిఫికెట్స్ తీసుకుంటున్న దుస్థితి.ఇప్పుడు విద్యార్థుల నడ్డి విరిచేటట్టు విద్యార్థుల బస్సు పాస్ ధరలను పెంచడం నిజంగా బాధాకరం. పెంపు ప్రతిపాదనలను ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలి.

# పంట వ్యర్థాలను కాల్చకండి- పర్యావరణాన్ని కాపాడండి

**-కెవికె సమన్వయకర్త డా.వి.లక్ష్మి నారాయణమ్మ**

**తెలంగాణ వీణ,భద్రాద్రి కొత్తగూడెం**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అన్నదాతల అవగాహన కార్యక్రమం 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు"లో భాగంగా సుజాతనగర్ మండలంలోని నాయకుల గూడెంలో కృషి విజ్ఞాని. కేంద్రం శాస్త్రవేత్తల బృందం పర్యటించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా .కెవికె ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా? వి.లక్ష్మి నారాయణమ్మ మాట్లాడుతూ రైతులు తమ పంటలను తీసివేసిన తర్వాత వచ్చి పంట వ్యర్థాలను.కాల్చకుండా భూమిలో కలియదున్నాలని సూచించారు. తద్వారా భూసారం పెరగడమే కాకుండాం పర్యావరణ కాలుష్యం కూడా తగ్గుతుందని తెలయజేశారు.

వీటితో పాటు చెట్లను పెంచడం మరియు రసాయన ఎరువుల వాడకం గురించి కూడా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మెన్ హనుమంతరావు ముఖ్య అతిధిగా విచ్చేసి కృషి విజ్ఞాన. కేంద్రంలో పనిచేస్తున్న శాస్త్రవేత్తల సేవలను ఉపయోగించు కోవాలని తెలిపారు. ఆధునిక పద్ధతులు పాటిస్తూ వ్యవసాయం చేస్తున్న చిన్న, సన్న కారు రైతులను ప్రోత్సహిస్తూ అవార్డులకు



ఎంపిక చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఉద్యాన శాస్త్రవేత్త బి బి.శివ, మండల వ్యవసాయ అధికారిణి శ్రీమతి నర్మద, విస్తరణ అధికారి శరత్ మరియు 52 మంది ఔత్సాహిక రైతులు పాల్గున్నారు.

## శానిటేషన్ వర్కర్స్ అవగాహన సదస్సు






**తెలంగాణ వీణ/ చేగుంట...**

మెదక్ జిల్లా, చేగుంట మండలం, స్థానిక శానిటేషన్ వర్కర్స్ అవగాహన కార్యక్రమము జడ్పీహెచ్ఎస్ చేగుంట పాఠశాలలో నిర్వహించి వాళ్ల చేయవలసినటువంటి పనుల పట్ల అవగాహన కల్పించడం జరిగింది. టాయిలెట్స్ క్లీన్ చేయడం పాఠశాల పరిసరాలన్నీ పరిశుభ్రంగా ఉంచడము, మొక్కలకు నీళ్లు పెట్టడం, టాయిలెట్స్ శుభ్రం ఏ విధంగా చేయాలి మొదలైనటువంటి విషయాల పైన అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి నీరజ, మండల ఆర్పీగా వ్యవహరించినటువంటి బాలయ్య, ఎస్జిటి మండలంలోని అన్ని పాఠశాలల సానిటేషన్ వర్కర్స్ అందరూ పాల్గొనడం జరిగింది.

## హుజూర్నగర్ నియోజకవర్గం గరిడేపల్లి మండల్ బీజేపీ ఉపాధ్యక్షునిగా లక్ష్మయ్య గౌడ్...

**తెలంగాణ వీణ/హుజూర్ నగర్:**



హుజూర్ నగర్ నియోజకవర్గ గరిడేపల్లి మండల్ బీజేపీ ఉపాధ్యక్షునిగా గరిడేపల్లి మండలం మర్రికుంట గ్రామానికి చెందిన కుక్కడపు లక్ష్మణ్ గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం బీజేపీ నూతన కమిటీని ఎన్నుకున్నారు. సూర్యాపేట జిల్లా పార్టీ అధ్యక్షురాలు శ్రీమతి శ్రీలత రెడ్డి ఆదేశాల మేరకు ఈ కమిటీ నిర్వహించి నియామక పత్రాన్ని లక్ష్మణ్ గౌడ్కు అందించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నుకోబడ్డ ఉపాధ్యక్షుడు లక్ష్మణ్ గౌడ్ మాట్లాడుతూ నన్ను గుర్తించి హుజూర్నగర్ నియోజకవర్గ గల్లేపల్లి మండల ఉపాధ్యక్షులుగా ఎన్నుకున్న బిజెపి నూతన మండల కమిటీ సూర్యాపేట జిల్లా పార్టీ అధ్యక్షుడు శ్రీలత రెడ్డికి, మండల కమిటీ పెద్దలకు పార్టీ సీనియర్లకు బుబ్బ భాగ్యరెడ్డి, శానంపూడి సైదిరెడ్డి. తదితరులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రతీ కార్యకర్తను కలుపుకొని పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## కర్నాల్ పల్లిలో ఇంటింటా బడిబాట





**తెలంగాణ వీణ /చేగుంట...**

మెదక్ జిల్లా, చేగుంట మండలం కర్నాల్ పల్లి గ్రామంలో బడిబాట కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు కోసం ఇంటింటా ప్రచారం చేయడం జరిగింది. కరపత్రాలను పంచుతూ.. పాఠశాల విశేషాలను తెలియజేస్తూ.. ప్రభుత్వ పాఠశాలలో చదివినట్లయితే నైతిక విలువలతో కూడినటువంటి విద్య అందుతుందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలో చేరే విధంగా ఉపాధ్యాయులు ప్రేరణ కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిట్టబోయిన సత్యనారాయణ, ఉపాధ్యాయులు బాలచంద్రం, మక్కరాజుపేట ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పాండు, శ్రీనివాసరావు, సరిత, రామకృష్ణ, సవితారాణి తదితరులు పాల్గొన్నారు.

# వర్షాకాలంలోనైనా మరమత్తులు చేయించండి సారు

**-మున్సిపల్ కార్యాలయానికి వెళ్ళాలంటే గుంతల రోడ్డులోనే ప్రయానంచేయాలా**
**-అద్వాన స్థితిలో తూంకుంట మున్సిపల్ రోడ్డు**
**-వర్షాకాలంలోనైనా మరమత్తులు చేయించండి సారు**

**తెలంగాణ వీణ, మేడ్చల్ జిల్లా :**





ఆ మున్సిపల్ కార్యాలయం వెళ్ళాలంటే గుంతల రోడ్డులో ప్రయాణించాల్సిందే. రాజీవ్ రహదారికి ఆనుకుని ఉన్న అద్వానమైన పరిస్థితి. ఇక వర్షాకాలం వచ్చిందంటే పరిస్థితి చెప్పాల్సిన అవసరం లేదు. చిన్న వర్షానికే చిత్తడి చిత్తడి ప్రజలు, ప్రయాణీకులతో పాటు మున్సిపల్ కార్యాలయానికి వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నా ఆ మున్సిపల్ కమిషనర్, డీఈఈలకు మాత్రం పట్టడం లేదు. ఇప్పటికైనా పట్టించుకుని కొత్తరోడ్డు వేయకున్న సరే కనీసం ఉన్నరోడ్డపైనా మరమత్తులు చేయించండి సారు అంటు తూంకుంట వాసులు మొర పెట్టుకుంటున్నారు. ఇది ఎక్కడో కాదు మేడ్చల్– మల్కాజ్గిరి జిల్లా కార్యాలయానికి కూతివేటు దూరంలోనే ఉన్న తూంకుంట మున్సిపల్ కార్యాలయం ప్రధాన రోడ్డు పరిస్థితి. తూంకుంట నుంచి బిట్స్ కాలనీకి బీటీ రోడ్డు మంజూరి, పనులు పూర్తి అయిన అధికారులు మున్సిపల్ కార్యాలయం ముందున్న రోడ్డు దుస్థితి గుర్తుకు రాకపోవడంతో పట్టణ వాసులు ముక్కున వేలువేసుకుంటున్నారు. రోడ్డు మరమత్తులపై కమిషనర్కు వివరణ కోసం ఫోన్ కాల్ చేయగా స్పందించకపోవడం గమనార్హం.

## కోర్టు తీర్పు చారిత్రాత్మక నిర్ణయం.

**తెలంగాణ రాష్ట్ర బిజెపి అధికార ప్రతినిధి తూళ్ళ వీరేందర్ గౌడ్.**

**తెలంగాణ వీణ,మహేశ్వరం...**



తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని మంఖాల్ లో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మత ప్రాతిపదికన స్థానికేతరులకు కేటాయించడాన్ని వ్యతిరేకిస్తూ ప్రజలతో కలిసి చేసిన మా ఏడాది పోరాటం ఫలించిందని న్యాయస్థానం తీర్పును హర్షం వ్యక్తపరుస్తూ స్వాగతిస్తున్నామని బిజెపి తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. తమ రాజకీయ లబ్ధి కోసం తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పాతబస్తీ ప్రజలకు ఇవ్వాలనుకున్న గత బి ఆర్ ఎస్ ప్రభుత్వానికి ఈ తీర్పు ఒక చెంప పెట్టు లాంటిదని అయన అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తమ హక్కుల కోసం పోరాటం చేస్తున్న 300 మందికిపైగా మహిళలపై అధికార బలాన్ని ప్రయోగించి అన్యాయంగా అరెస్టు చేయించడం జరిగిందని ఆయన ధ్వజమెత్తారు. న్యాయం కోసం పేదల హక్కుల కోసం చేసిన పోరాటాన్ని అణిచివేయాలని ఎన్నో కుట్రలు పన్నినారని ఆయన పేర్కొన్నారు. న్యాయస్థానం ఇచ్చిన తీర్పు కేవలం ఒక తుక్కుగూడ ప్రాంతానికే పరిమితం కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఇండ్ల కేటాయింపులకు వర్తిస్తుందని ఆయన గుర్తు చేశారు. న్యాయస్థానం ఇచ్చిన తీర్పును ప్రతి ఒక్కరూ స్వాగతించాలని ఆయన కోరారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఈ ప్రాంతం వాసులకు కేటాయించాలని చేసిన పోరాటానికి సహకరించి మద్దతుగా నిలిచిన ప్రజలకు, మంఖాల్ డబుల్ బెడ్ రూమ్ సాధన సమితికి, వివిధ సంఘాల నాయకులకు ప్రతి ఒక్కరికి ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. పేదలకు ఎక్కడైనా అన్యాయం జరిగితే న్యాయం జరిగే వరకూ బిజెపి పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు, పోరాటాలు చేపట్టడం జరుగుతుందని ఆయన ప్రజలకు భరోసా ఇచ్చారు.

## కాంగ్రెస్ పార్టీలోకి భారీ చేరికలు



**తెలంగాణ వీణ,కుత్బుల్లాపూర్...**

125 డివిజన్ తమిళ్ బస్తీ కు చెందిన కాశీ మని, రాజేందర్, కృష్ణ, శాంతి, సెల్వి, సుగుణ, నాగేంద్ర, రోజా, మేరీ, గోవిందస్వామి, రవి, నాగలక్ష్మి, నాగమణి, మూర్తి, మౌనిక, శ్రీను, మనీ, శాంతమ్మ, బాలు చారి, ఎమ్ శివకుమార్, ఇంద్రమ్మ, సజ్జమ్మ, కాలప్ప , శివకుమార్, శ్రీను, సురేష్, విజయ మరియు 100 మంది వివిధ పార్టీల నాయకులు డి. శ్యామ్ ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి చే కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య

**ప్రభుత్వ బడుల బలోపేతానికి కృషి చేస్తున్న స్థానిక ప్రజాప్రతినిధులు**

**తెలంగాణ వీణ,వర్ధన్నపేట...**



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టి అమలు చేస్తున్న బడిబాట లో మహిళా సంఘాల భాగస్వామ్యంతోనే ప్రభుత్వ బడులు బలోపేతం అవుతాయనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన విధానాన్ని అమలుపరిచే దిశగా జిల్లా కలెక్టర్, డిఆర్డిఓ ఆదేశాల మేరకు సోమవారం వర్ధన్నపేట మండలం ఇల్లంద లో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట గ్రామ సభ నిర్వహించారు. ఈ సమావేశంలో తాసిల్దార్ విజయ సాగర్ ఎంపీడీవో ఏపీఎం వేణు సిసి గోలి కొమురయ్య , గ్రామ కార్యదర్శి రామారావు,కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, సీనియర్ నాయకులు పోశాల వెంకన్న గౌడ్, మాజీ సర్పంచులు పెంచాల కుమార స్వామి,రాయపురపు కుమారస్వామి, మోడెం కుమారస్వామి,మాజీ వార్డు సభ్యులు పెద్దగోని కవిరాజు, గడ్డం సమ్మయ్య, ఉపాద్యాయులు, వివోఏ లు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పార్టీ అధినేత కేసిఆర్ కి ఘన స్వాగతం పలకాలి

**మాజీ మంత్రి ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్**



**తెలంగాణ వీణ,వెస్ట్ మారేడ్పల్లి ...**

తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, బి ఆర్ ఎస్ పార్టీ అధినేత కె సి ఆర్ కు ఘన స్వాగతం పలకాలని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పిలుపునిచ్చారు. మంగళవారం సనత్ నగర్ నియోజకవర్గ పరిధిలోని బి ఆర్ ఎస్ పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు పై ఏర్పాటైన కమిషన్ విచారణకు హాజరయ్యేందుకు కె సి ఆర్ బుధవారం ఉదయం బి ఆర్ కె భవన్ కు వస్తారని వివరించారు. ఉదయం 10.00 గంటల వరకు నియోజకవర్గ పరిధిలోని పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో బి ఆర్ కె భవన్ వద్దకు చేరుకొని కె సి ఆర్ కు ఘనంగా స్వాగతం పలకాలని కోరారు. ఈ సమావేశంలో బి ఆర్ ఎస్ యువనేత తలసాని సాయి కిరణ్ యాదవ్, పార్టీ డివిజన్ అధ్యక్షులు అత్తిలి శ్రీనివాస్ గౌడ్, కొలన్ బాల్ రెడ్డి,గుర్రం పవన్ కుమార్ గౌడ్, ఆకుల హరికృష్ణ, హన్మంతరావు, వెంకటేషన్ రాజు, మాజీ కార్పొరేటర్ అత్తిలి మల్లిఖార్జున్ గౌడ్, నాయకులు శ్రీహరి, సురేష్ గౌడ్, లక్ష్మీపతి, కిషోర్, ఆరీఫ్, జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# బిజినెస్

# బంగారం కొనుగోలుదారులకు గుడ్‌న్యూస్..

## భారీగా పడిపోయిన వెండి ధర..!



**తెలంగాణవీణ, బిజినెస్**

బంగారం ధరలు కొనుగోలుదారులకు ఊరటనిచ్చాయి. ఆభరణాల వ్యాపారులు, స్టాకిస్టుల అమ్మకాలతో ధరలు దిగివచ్చాయి. దేశ రాజధాని ఢిల్లీ నగరంలో 24 క్యారెట్ల పసిడి ధర రూ.100 తగ్గి.. తులానికి రూ.97,670కి పతనమైంది. అలాగే, 22 క్యారెట్ల గోల్డ్ ధర రూ.100 తగ్గి.. తులం రూ.97,250కి చేరుకుంది. ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ ధ్రువీకరించింది. ఏడు రోజుల ర్యాలీ తర్వాత మంగళవారం వెండి ధరలు భారీగా పడిపోయాయి. రూ.1000 తగ్గి కిలోకు రూ.1,07,100కి తగ్గింది. విదేశీ మార్కెట్‌లో స్పాట్ బంగారం స్వల్పంగా పెరిగి ఔన్సుకు 3,329.12 డాలర్లకు చేరుకుంది. స్పాట్ వెండి 0.3 శాతం తగ్గి ఔన్సుకు 36.64కి చేరుకుంది.అమెరికా, చైనా మధ్య వాణిజ్యం అంచనాలు బంగారం ధరను తగ్గించాయని రిలయన్స్ సెక్యూరిటీస్ సీనియర్ విశ్లేషకుడు శ్రీరామ్ అయ్యర్ తెలిపారు. లండన్‌లో చైనా, అమెరికా మధ్య వాణిజ్య చర్చలు జరుగుతుండగా.. ఇది ప్రపంచంలోని రెండు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల మధ్య ఒప్పందంపై ఎన్నో ఆశలున్నాయి. ఈ వారం బంగారం ధరల్లో అస్థిరత పెరిగే అవకాశాలున్నట్లుగా వ్యాపారులు అంచనా వేస్తున్నారు. ఇదిలా ఉండగా.. హైదరాబాద్‌లో బంగారం ధరలను పరిశీలిస్తే.. 24 క్యారెట్ల గోల్డ్ రూ.97,580 ఉండగా.. 22 క్యారెట్ల పసిడి రూ.89,450 పలుకుతుదున్నది. ఇక వెండి కిలో రూ.1.19లక్షలు పలుకుతున్నది.

## వరుస లాభాలకు బ్రేక్..

### ఫ్లాట్‌గా ముగిసిన సూచీలు..!




**తెలంగాణవీణ, బిజినెస్**

దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం ఫ్లాట్‌గా ముగిశాయి. ఇటీవల వరుస సెషన్లలో లాభాల్లో ముగిసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే మదుపరులు లాభాల స్వీకరణకు దిగడంతో మార్కెట్లు అస్థిరతకు గురయ్యాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 82,643.73 పాయింట్ల వద్ద లాభాల్లో మొదలైంది. ఆ తర్వాత కొద్దిసేపటికి మార్కెట్లు ఒడిదొడుకులను ఎదుర్కొన్నాయి. ఈ క్రమంలో సెన్సెక్స్ ఇంట్రాడేలో 82,680.79 పాయింట్ల గరిష్టాన్ని తాకగా.. అత్యల్పంగా 82,240.40 పాయింట్ల కనిష్టానికి తగ్గింది. చివరకు 53.49 పాయింట్లు పతనమై.. 82,391.72 వద్ద స్థిరపడింది.నిఫ్టీ 1.05 పాయింట్లు పెరిగి 25,104.25 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో దాదాపు 2,160 షేర్లు పెరిగాయి. మరో 1,723 షేర్లు పతనమయ్యాయి. నిఫ్టీలో గ్రాసిమ్ ఇండస్ట్రీస్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, టెక్ మహీంద్రా, టాటా మోటార్స్, ఇన్ఫోసిస్ లాభపడగా.. ట్రెంట్, ఆసియన్ పెయింట్స్, బజాజ్ ఫైనాన్స్, టాటా స్టీల్, బజాజ్ ఫిన్‌సర్వ్ నష్టపోయాయి. రియాల్టీ ఇండెక్స్ ఒకశాతం పతనం కాగా.. ఐటీ ఇండెక్స్ 1.7 శాతం పెరిగింది. మీడియా ఇండెక్స్ ఒకశాతం వృద్ధిని నమోదు చేసింది. పవర్ ఇండెక్స్ దాదాపు ఒకశాతం లాభపడింది. బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ ఫ్లాట్‌గా ముగియగా.. బీఎస్ఈ స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.3 శాతం పెరిగింది.

## పెరిగిన భారత్ చక్కెర ఎగుమతులు..

### అత్యధికంగా సోమాలియాకే..!



**తెలంగాణవీణ, బిజినెస్**

భారత్ చక్కెర ఎగుమతులు పెరుగుతున్నాయి. ప్రస్తుత మార్కెటింగ్ సంవత్సరం 2024-25 జూన్ 6 వరకు భారత్ 5.16 లక్షల టన్నుల షుగర్‌ను ఎగుమతి చేసింది. ట్రేడ్ బాడీ ఆల్ ఇండియా షుగర్ ట్రేడ్ అసోసియేషన్ మంగళవారం డేటా ప్రకారం.. చక్కెర మార్కెటింగ్ సంవత్సరం అక్టోబర్ నుంచి సెప్టెంబర్ వరకు నడుస్తుంది. భారతదేశంలో 2024-25 మార్కెటింగ్ సంవత్సరానికి చక్కెర ఎగుమతులను జనవరి 20న కేంద్రం అనుమతి చ్చింది. గరిష్ట ఎగుమతి పరిమాణాన్ని 10 లక్షల టన్నులుగా నిర్ణయించింది. ప్రస్తుత మార్కెటింగ్ సంవత్సరం జూన్ 6 వరకు మిల్లులు మొత్తం 5,16,782 టన్నుల చక్కెరను ఎగుమతి చేశాయి.ఇందులో 4.09 లక్షల టన్నుల తెల్ల చక్కెర, 81,845 టన్నుల శుద్ధి చేసిన చక్కెర, 25,382 టన్నుల ముడి చక్కెర ఎగుమతి అయ్యింది. దాదాపు 23,219 టన్నుల చక్కెర లోడింగ్ దశలో ఉన్నది. ఇప్పటివరకు జరిగిన మొత్తం ఎగుమతుల్లో అత్యధికంగా సోమాలియాకు గరిష్టంగా 1,18,553 టన్నుల చక్కెర ఎగుమతి అయ్యింది. ఆ తర్వాత శ్రీలంకకు 76,401 టన్నులు, ఆఫ్ఘనిస్తాన్ కు 72,833 టన్నులు, జిబౌటికి 69,609 టన్నులు ఎగుమతులు జరిగాయని ట్రేడ్ అసోసియేషన్ పేర్కొంది. ఈ ఏడాది సెప్టెంబర్‌తో ముగిసే సీజన్‌లో 10 లక్షల టన్నుల చక్కెర ఎగుమతి కేంద్రం జనవరిలో అనుమతి ఇవ్వగా.. మొత్తం ఎగుమతులు 8లక్షల టన్నులకు చేరుకోవచ్చని ట్రేడ్ బాడీ ఆల్ ఇండియా షుగర్ ట్రేడ్ అసోసియేషన్ ఇటీవల తెలిపింది.

# స్పోర్ట్స్

## అంతర్జాతీయ క్రికెట్‌కు విండీస్ విధ్వంసక బ్యాటర్ నికోలస్ పూరన్ గుడ్‌బై




**తెలంగాణవీణ, క్రీడలు :**

అంతర్జాతీయ క్రికెట్ నుంచి మరో స్టార్ ప్లేయర్ తప్పుకున్నాడు. వెస్టిండీస్ విధ్వంసక బ్యాటర్ మూడు ఫార్మట్లకు వీడ్కోలు పలికాడు. 29 ఏండ్ల వయస్సులోనే రిటైర్మెంట్ ప్రకటించి క్రికెట్ ప్రపంచానికి షాకిచ్చాడు. విండీస్ వికెట్ కీపర్-బ్యాటర్ నికోలస్ పూరన్ అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్ బై చెప్పాడు. అయితే ఫ్రాంచైజ్ క్రికెట్‌లో మాత్రం కొనసాగుతానని వెల్లడించారు. దక్షిణాఫ్రికా క్రికెటర్ హెన్రిచ్ క్లాసెన్ రిటైర్మెంట్ ప్రకటించిన కొన్ని రోజుల వ్యవధిలోనే పూరన్ అంటర్జాతీయ క్రికెట్ నుంచి తప్పుకోవడం విశేషం. ఈమేరకు పూరన్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేశాడు. ఇది ఎంతో కఠినమైన నిర్ణయమని, అయినప్పటికీ చాలా ఆలోచించిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నా అని రాసుకొచ్చాడు.చాలా ఆలోచించిన తర్వాత అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాలని నిర్ణయించుకున్నా. తాము ఎంతో ఇష్టపడే ఈ ఆట చాలా ఇచ్చింది. ఇస్తూనే ఉంటుంది. వెస్టిండీస్ ప్రజలకు ప్రాతినిధ్యంవహించే అవకాశం ఎంతో ఆనందాన్ని, మరపురాని జ్ఞాపకాలు మిగిల్చింది. ఆ మెరూన్ రంగు ధరించడం, జాతీయగీతం కోసం నిలబడటం, మైదానంలోకి అడుగుపెట్టిన ప్రతిసారీ పూర్తిస్థాయిలో ప్రదర్శన ఇవ్వడం. నిజంగా మాటల్లో చెప్పడం కష్టం. కెప్టెన్‌గా జట్టును నడిపించడం నేను ఎల్లప్పుడూ గుర్తుంచుకునే గౌరవం' అని రాసుకొచ్చారు. నాపై చూపిన అమితమైన ప్రేమకు ధన్యవాదాలు, కష్ట సమయాల్లో నావెంటే ఉన్నారంటూ అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా ఈ ప్రయాణంలో నాతో కలిసినందుకు కుటుంబ సభ్యులు, స్నేహితులకు ధన్యవాదాలు తెలిపారు. వారి నమ్మకం, మద్దతు తనను ముందుకు నడిపించాయని చెప్పారు.విండీస్ తరఫున 61 వన్డేలు ఆడిన ఈ లెఫ్ట్ హాండ్ బ్యాటర్ 1983 రన్స్ చేశాడు. వాటిలో 3 సెంచరీలు ఉన్నాయి. 106 టీ20ల్లో 2275 పరుగులు చేశాడు. ఇటీవల ఐపీఎల్ 2025 సీజన్‌లో తన పవర్ ఏంటో చూపించారు. లక్నో సూపర్ జెయింట్స్ తరఫున ఆడిన ఈ లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్ గ్రౌండ్‌లో సిక్సర్ల వర్షం కురిపించాడు. 14 మ్యాచ్‌ల్లో దాదాపు 200 స్ట్రైక్ రేట్‌తో 524 పరుగులు సాధించాడు. విడీస్ టీ20 జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించిన పూరన్.. మరో 8 నెలల్లో పొట్టి ప్రపంచకప్ ఉండగా తప్పుకోవడం గట్టి ఎదురుదెబ్బేనని చెప్పొచ్చు.

## కౌంటీ ఛాంపియన్‌షిప్ లో గైక్వాడ్..

### ఫామ్ చాటుకుంటాడా..!



**తెలంగాణవీణ, క్రీడలు :**

ఇంగ్లండ్ పర్యటనలో ఉన్న రుతురాజ్ గైక్వాడ్ అక్కడే మరికొన్ని రోజులు ఉండనున్నాడు. భారత సీనియర్ జట్టుతో నాలుగు రోజుల మ్యాచ్ అనంతరం ఈ యంగ్‌స్టర్ కౌంటీ ఛాంపియన్‌షిప్‌లో బరిలోకి దిగనున్నాడు. ప్రస్తుతం భారత 'ఏ' జట్టు స్క్వాడ్‌లో ఉన్న గైక్వాడ్ త్వరలోనే యార్క్‌షైర్ జట్టు తరఫున ఆడనున్నాడు. ఈ విషయాన్ని సదరు టీమ్ మంగళవారం ధ్రువీకరించింది. కౌంటీ ఛాంపియన్‌షిప్‌లో రుతురాజ్ 5 మ్యాచ్‌లు ఆడుతాడు. అనంతరం వన్డే కప్‌లోనూ పాల్గొంటాడీ యువ క్రికెటర్.'ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్ సారథి, రంజీల్లో మహారాష్ట్రకు కెప్టెన్. పుణేకు చెందిన గైక్వాడ్ అంతర్జాతీయ క్రికెట్‌లో విజయవంతమైన క్రికెటర్. ఆరు వన్డేలు, 23 టీ20లు ఆడిన అనుభవం అతడికి ఉంది. కుడిచేతి వాటం బ్యాటర్ అయిన గైక్వాడ్ ఏ స్థానంలోనైనా ఆడగల సమర్థుడు. ఓపెనింగ్ నుంచి నాలుగో స్థానంలో దంచికొట్టగలడు' అని యార్క్‌షైర్ ఓ ప్రకటనలో వెల్లడించింది. గైక్వాడ్ సైతం కౌంటీ ఛాంపియన్‌షిప్‌లో ఆడేందుకు ఉత్సాహంగా ఎదురుచూస్తున్నాని తెలిపాడు.

## ఐసీసీ ఆల్ ఆఫ్ ఫేమ్'లో భారత దిగ్గజాలు.. ఆ 11 మందిలో మహిళలు ఇద్దరే..!



**తెలంగాణవీణ, క్రీడలు :**

అంతర్జాతీయ క్రికెట్‌లో చెరగని ముద్ర వేసిన ఆటగాళ్లను ఐసీసీ ఆల్ ఆఫ్ ఫేమ్‌తో గౌరవిస్తుంటుంది. తాజాగా భారత జట్టు మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ ఆ జాబితాలో చోటు దక్కించుకున్నాడు. తద్వారా ఘనత సాధించిన 11వ టీమిండియా ఆటగాడిగా మహీ నిలిచాడు. ఈసారి అతడితోపాటు మరో ఆరుగురు క్రికెటర్లకు ఆల్ ఆఫ్ ఫేమ్ గౌరవం కల్పించింది ఐసీసీ.తొలినాళ్లలో టీమిండియాకు విశేష సేవలందించిన ఆటగాళ్లలో కొందరు ఈ మర్యాదను స్వీకరించారు. ధోనీ కంటే ముందు 11 మంది భారత దిగ్గజాలు ఆల్ ఆఫ్ ఫేమ్‌లో స్థానం సంపాదించారు. మనదేశం నుంచి తొలిసారి ఈ జాబితాలో చేరింది ఎవరో తెలుసా.మాజీ ఓపెనర్ గవాస్కర్, బిషన్ సింగ్ బేడీ, 1983 వరల్డ్ కప్ ఛాంపియన్ జట్టుకు కెప్టెన్ కపిల్ దేవ్‌లు 2009లో ఐసీసీ ఆల్ ఆఫ్ ఫేమ్ గౌరవం సంపాదించారు. 2015లో లెగ్ స్పిన్నర్ అనిల్ కుంబ్లే, వాల్‌గా పేరొందిన రాహుల్ ద్రవిడ్ 2018లో ఈ జాబితాలో చేరగా.. మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ 2019లో వీళ్ల సరసన నిలిచాడు. వినోద్ మన్కడ్ కూడా ఆల్ ఆఫ్ ఫేమ్‌లో చోటు దక్కించుకున్నాడు.మాజీ డాషింగ్ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్, భారత మహిళా క్రికెట్ పురోగతికి దోహదపడిన డయాని ఎడుజి 2023లో .. 2024లో నీతు డేవిడ్‌లకు ఐసీసీ ఆల్ ఆఫ్ ఫేమ్ గౌరవం కల్పించింది. ఇప్పుడు ఎంఎస్ ధోనీ కూడా వీళ్ల సరసన చేరాడు. మామూలుగా అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన ఆటగాళ్లను ఆల్ ఆఫ్ ఫేమ్‌లోకి తీసుకుంటుంది ఐసీసీ. ఐదు సంవత్సరాల క్రితం చివరి ఇంటర్నేషనల్ మ్యాచ్ ఆడిన క్రికెటర్లు కూడా ఈ గౌరవాన్ని పొందేందుకు అర్హులే. తాజాగా ధోనీతో పాటు ఐసీసీ ఆల్ ఆఫ్ ఫేమ్‌లోకి ఎంట్రీ ఇచ్చిన మాజీలు వీళ్లే. గ్రేమ్ స్మిత్, హషీమ్ ఆమ్లా (దక్షిణాఫ్రికా), మాథ్యూ హెడెన్(ఆస్ట్రేలియా), డానియల్ వెటోరీ (న్యూజిలాండ్), సారా టేలర్ (ఇంగ్లండ్), సనా మిర్ (పాకిస్థాన్)




# ఓటీటీలోకి సంతానం హారర్ కామెడీ.. స్ట్రీమింగ్ ఎక్కడంటే!

**తెలంగాణవీణ, సినిమా :**
ప్రముఖ తమిళ నటుడు సంతానం నటించిన హారర్ కామెడీ చిత్రం 'డీడీ నెక్స్ట్ లెవెల్'. తమిళ హారర్ కామెడీ ఫ్రాంచైజీ డీడీ నుంచి వచ్చిన నాలుగో చిత్రమిది. ఈ సినిమాకు ఎస్. ప్రేమ్ ఆనంద్ దర్శకత్వం వహించగా.. నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్, ది షో పీపుల్ బ్యానర్‌లపై వెంకట్ బోయనపల్లి, ఆర్య సంయుక్తంగా ఈ సినిమాను నిర్మించారు. సంతానంతో పాటు గౌతం వాసుదేవ్ మీనన్, సెల్వరాఘవన్, నిజల్గల్ రవి, గీతికా తివారీ, మోట్ట రాజేంద్రన్, యషికా ఆనంద్, కస్తూరి శంకర్ తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రల్లో నటించారు. మే 16న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం మంచి విజయాన్ని అందుకుంది. ఇప్పుడు ఇదే చిత్రం తాజాగా ఓటీటీలోకి రాబోతుంది. ప్రముఖ ఓటీటీ వేదిక జీ5లో తెలుగులో జూన్ 13 నుంచి ఈ సినిమా స్ట్రీమింగ్ కానుంది. ఈ సినిమా కథ కృష్ణమూర్తి (సంతానం) అనే సినీ విమర్శకుడు, యూట్యూబర్ చుట్టూ తిరుగుతుంది. తన జెన్యూన్ రివ్యూలతో కృష్ణమూర్తి యూట్యూబ్‌లో మంచి గుర్తింపు తెచ్చుకోవడంతో పాటు ప్రేక్షకుల నుంచి ప్రశంసలు అందుకుంటాడు. అయితే ఒకరోజు కృష్ణమూర్తికి హిచ్‌కాక్ ఇరుదరాజ్ (సెల్వరాఘవన్) అనే దర్శకుడు తీసిన 'డీడీ నెక్స్ట్ లెవెల్' అనే సినిమా స్క్రీనింగ్‌కు హాజరుకావాలని ప్రత్యేక ఆహ్వానం వస్తుంది. దీంతో అతను తన కుటుంబంతో కలిసి ఆ సినిమా చూడడానికి వెళ్తాడు. అయితే తాను వెళ్లింది ఒక దెయ్యాల థియేటర్ అని, అక్కడికి వెళ్తే బయటకు రావడం అసాధ్యమని కృష్ణమూర్తికి తెలుస్తుంది. గతంలో తాను రివ్యూ ఇచ్చిన ఒక సినిమా నిర్మాత తనపై పగ తీర్చుకోవడానికే ఇలా చేశాడని గ్రహిస్తాడు. దీంతో ఆ థియేటర్ నుంచి ఎలాగైనా బయటపడాలని కృష్ణమూర్తి ప్రయత్నిస్తాడు. అయితే ఆ థియేటర్ నుంచి కృష్ణమూర్తి ఎలా బయటపడ్డాడు.

# మాల్దీవులకి గ్లోబల్ బ్రాండ్ అంబాసిడర్‌గా కత్రినా కైఫ్

**తెలంగాణవీణ, సినిమా :**
పర్యాటకులకి మాల్దీవ్స్ ఎంతటి ఉల్లాసాన్ని ఉత్సాహాన్ని ఇస్తుందనేది ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. నీలి రంగు సముద్రం చూస్తుంటేనే మనసు పులకరించిపోతుంది. అయితే మాల్దీవ్స్ జీవితంలో ఒక్కసారైన చూడాలని చాలా మందికి కల ఉంటుంది. ఆ కలని కొందరు సాకారం చేసుకుంటున్నారు. అయితే ఇప్పుడు మాల్దీవులకి గ్లోబల్ బ్రాండ్ అంబాసిడర్‌గా కత్రినా కైఫ్ ఎంపికయింది. మాల్దీవులను ప్రముఖ పర్యాటక గమ్యంగా పరిచయం చేయడంలో భాగంగా కత్రినాని అంబాసిడర్‌గా ఎంపిక చేసినట్టు మాల్దీవుల టూరిజం ప్రమోషన్ సంస్థ అయిన మాల్దీవ్స్ మార్కెటింగ్ అండ్ పబ్లిక్ రిలేషన్స్ కార్పొరేషన్ తాజాగా ప్రకటించింది. కత్రినా కైఫ్ రాయబారిగా ఎంపిక కావడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ.. మాల్దీవులు అనేవి సహజసిద్ధమైన అందం, ఎంతో ప్రశాంతంగా ఉండే ప్రదేశం. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పర్యాటకులని పెంచేందుకు, వారికి అత్యుత్తమ అనుభవాలను అందించేందుకు నా వంతు కృషి చేస్తానని కత్రినా స్పష్టం చేశారు. మరోవైపు, మాల్దీవ్స్ రాజకీయంగా కూడా భారత్ సంబంధాలు మెరుగుపరచుకునేందుకు ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తుంది. మాల్దీవుల అధ్యక్షుడు మొహమ్మద్ ముఇజ్జు ఇచ్చిన ఆహ్వానానికి సానుకూలంగా స్పందించిన , భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జూలై నెలలో మాల్దీవులకు వెళ్లే అవకాశముందంటూ నెట్టింట ప్రచారం జరుగుతుంది. ఇదే నిజమైతే ముఇజ్జు అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రధాని మోదీ మొదటి పర్యటన అవుతుంది. కత్రినా కైఫ్ గ్లోబల్ అంబాసడర్‌గా, మరోవైపు ప్రధాని మోదీ పర్యటన ..ఈ రెండు సంఘటనలూ మాల్దీవులను ఒక ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా బలోపేతం చేయడం ఖాయం అని నెటిజన్స్ అంటున్నారు. కాగా, ఆ మధ్య ప్రధాని మోదీపై మాల్దీవులకు చెందిన ముగ్గురు మంత్రులు మరియం షియూనా, మాల్షా షరీఫ్, మజూమ్ మాజిద్.. చేసిన అనుచిత వ్యాఖ్యలు చేసిన తర్వాత భారతీయులంతా మాల్దీవులను బహిష్కరించారు. ఈ క్రమంలో భారతీయులని ఆకర్షించే ప్రయత్నం చేస్తుంది. అందుకే కత్రినాని అంబాసిడర్‌గా ఎంపిక చేసినట్టు తెలుస్తుంది.








# 'కన్నప్ప' ట్రైలర్‌కు ముహూర్తం ఫిక్స్..!

**తెలంగాణవీణ, సినిమా :**
మంచు ఫ్యామిలీ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న కన్నప్ప చిత్రం నుంచి మేకర్స్ ట్రైలర్ అప్డేట్‌ను పంచుకున్నారు. కలెక్షన్ కింగ్ మంచు మోహన్ బాబు నిర్మిస్తున్న ఈ భారీ ప్రాజెక్ట్‌లో మంచు విష్ణు కథానాయకుడిగా నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ చారిత్రక చిత్రానికి మహాభారతం సీరియల్ ఫేమ్ ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో ప్రభాస్ తో పాటు బాలీవుడ్, కోలీవుడ్ అగ్రతారలు కూడా నటిస్తున్న విషయం తెలిసిందే. భారీ బడ్జెట్‌తో రాబోతున్న చిత్రం జూన్ 27న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి ట్రైలర్ అప్‌డేట్‌ను పంచుకున్నారు మేకర్స్. ఈ సినిమా ట్రైలర్‌ను శుక్రవారం(జూన్ 13) రోజున విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ఎక్స్ వేదికగా ప్రకటించింది.

# సినిమాను నిజజీవితంతో ఎందుకు పోలుస్తారు

**తెలంగాణవీణ, సినిమా :**
అగ్ర నటుడు కమల్ హాసన్ - దిగ్గజ దర్శకుడు మణిరత్నం కాంబినేషన్‌లో వచ్చిన 'థగ్ లైఫ్' మూవీ ఈ నెల 5వ తేదీన విడుదల కాగా ఈ సినిమాలోని తన పాత్రకు నెగెటివ్ కామెంట్స్ రావడంతో హీరోయిన్ త్రిష తీవ్ర నిరుత్సాహానికి గురయ్యారు. ఇందులో ఇంద్రాణి పాత్రలో త్రిష నటించగా, ఈ పాత్రపై సోషల్ మీడియాలో ట్రోల్స్ వస్తున్నాయి. దీనిపై త్రిష స్పందిస్తూ, 'మణిరత్నం దర్శకత్వంలో వచ్చిన 'పొన్నియిన్ సెల్వన్' మూవీలోని 'కుందవై' పాత్రను అమితంగా ఇష్టపడ్డారు. ఈ పాత్ర నాకు ఎంతో పేరు తెచ్చిపెట్టింది. నా కెరీర్‌లో ఒక ముఖ్యపాత్రగా మారింది. కానీ, 'థగ్ లైఫ్' మూవీలో ఇంద్రాణి పాత్రపై విమర్శలు గుప్పిస్తున్నారుకమల్, శింబుల పాత్రలతో సాగే నా క్యారెక్టర్‌ను కొందరు అసభ్య పదజాలంతో ట్రోల్స్ చేస్తున్నారు. మరికొందరు మలయాళ బిట్ సినిమాలతో పోల్చుతున్నారు. ఇది ఒక సినిమా.. ఒక పాత్ర. దర్శకుడు చెప్పినట్టుగా నటించాను. మణిరత్నం - కమల్ కాంబోపై ఘాటైన విమర్శలు మంచిదా? నేను ఏం చేశాను? సోషల్ మీడియా వైపు చూడాలంటేనే భయం వేస్తోంది. సినిమాను నిజ జీవితంతో ఎందుకు పోలుస్తారు?' అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, 'థగ్ లైఫ్'కు నెగెటివ్ కామెంట్స్ రావడానికి కథ, స్క్రీన్ ప్లే సరిగా లేకపోవడంతో ప్రేక్షకులను తీవ్ర నిరుత్సాహానికి గురిచేసిందన్న చర్చ సాగుతోంది.

# 'ది ఢిల్లీ ఫైల్స్'కి బదులుగా ది బెంగాల్ ఫైల్స్'..

## సినిమా టైటిల్ మార్చిన దర్శకుడు వివేక్ అగ్నిహోత్రి




**తెలంగాణవీణ, సినిమా :**
ది కశ్మీర్ ఫైల్స్', 'ది తాష్కెంట్ ఫైల్స్' వంటి సంచలన చిత్రాలతో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన దర్శకుడు వివేక్ రంజన్ అగ్నిహోత్రి తన తదుపరి చిత్రం 'ది ఢిల్లీ ఫైల్స్' అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న విషయం తెలిసిందే. ఈ సినిమాను 'ది కశ్మీర్ ఫైల్స్' నిర్మించిన టాలీవుడ్ బ్యానర్ అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ పతాకంపై అభిషేక్ అగర్వాల్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం సెప్టెంబర్ 5 2025న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో చిత్రయూనిట్ చిత్ర టైటిల్‌పై సంచలన నిర్ణయం తీసుకున్నాడు. ఈ సినిమా టైటిల్‌ను 'ది ఢిల్లీ ఫైల్స్ నుంచి 'ది బెంగాల్ ఫైల్స్: రైట్ టు లైఫ్ అని మార్చినట్లుగా ప్రకటించాడు. దీంతో ఈ చిత్రం ది బెంగాల్ ఫైల్స్ అంటూ ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సినిమా టీజర్‌ను జూన్ 12న విడుదల చేయనున్నారు. భిషేక్ అగర్వాల్, పల్లవి జోషి సహనిర్మాతలుగా వ్యవహరించిన ఈ చిత్రంలో మిథున్ చక్రవర్తి, అనుపమ్ ఖేర్, పల్లవి జోషి, గోవింద్ నామ్‌దేవ్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రల్లో నటించారు. ఈ చిత్రం అగ్నిహోత్రి 'ఫైల్సు ట్రయాలజీలో మూడవ భాగం, దీనిలో 'ది తాష్కెంట్ ఫైల్స్' (2019) మరియు 'ది కశ్మీర్ ఫైల్స్' (2022) కూడా ఉన్నాయి.


Published and printed by ulloju Srinivas on behlf of Veena publications printed at telangana Veena plot no.204 Maitri apartments.opp BSNL office ECIL kapra,med responsible for selection of news under the prb act, phone number 040 35668720 rni reg no.teltel/2280 reproduction in whole or in part without written